ముద్ర

సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

హైదరాబాద్
సోమవారం, 16.11.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:14 సంచిక: 009
పేజీలు: 08 వెల: రూ. 5

మరణ శిక్ష రద్దు వద్దు

ఐరాస తీర్మానానికి వ్యతిరేకంగా భారత్ ఓటు



2

- తాత్కాలిక నిషేధానికి పిలుపునిచ్చిన ఐరాస ముసాయిదా తీర్మానం
- తీర్మానానికి వ్యతిరేకంగా భారత్, అమెరికా, చైనాతో సహా 33 దేశాలు
- మరణశిక్షల అంశంపై ఎలాంటి ఏకాభిప్రాయం లేదన్న భారత ప్రతినిధి



ఆదుకోండి

మోదీ సాయం కోరిన రేవంత్!

ప్రధానితో సీఎం కీలక భేటీ

- తెలంగాణ ప్రాజెక్టులపై మోదీకి వినతి
- ఖేలో ఇండియా వేడుకలకు మోదీకి ఆహ్వానం
- ఎల్‌నినో ఎఫెక్ట్..
- కేంద్ర సాయం కోరిన సీఎం
- గోదావరి జలాలపై ప్రధానికి రేవంత్ విజ్ఞప్తి
- తుమ్మిడిహెట్టి, సమ్మక్కసాగర్‌పై చర్చ
- తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సహకరించండి
- గోదావరి-కావేరీ అనుసంధానంపై ప్రతిపాదన
- గ్లోబల్ సమ్మిట్‌కు రావాలి.. మోదీకి రేవంత్ ఆహ్వానం



ముద్ర, తెలంగా బ్యూరో:
ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్, ఖేలో ఇండియా గేమ్స్ కు హాజరుకావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం మధ్యాహ్నం ప్రధాని మోదీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో కేంద్ర క్రీడా, యువజ వ్యవహారాల శాఖ మంత్రి మన్ సుఖ్ మాండవీయ, తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. తెలంగాణకు సంబంధించిన ప్రాజెక్టులు, గోదావరి జలాలు, ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో పరిస్థితులపై కేంద్రం సాయాన్ని కోరారు. రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యలతో పాటు ఎల్‌నినో ప్రభావంపై చర్చించి, కేంద్రం సాయాన్ని కోరేందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఈ పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి తదితరులతో కలిసి ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి, మధ్యాహ్నం 12 గంటలకు ప్రధానితో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలను ప్రధానికి నివేదించి, వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో నెలకొన్న లోటు వర్షపాతం, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి, కేంద్రం నుంచి సాయం అందించాలని కోరారు. మిగతా 02లో



సజ్జనార్‌పై సీబీఐ దర్యాప్తు

సీఎంకు ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన లేఖ

- కీలక కేసులపై అనుమానాలు..
- సజ్జనార్ ఆస్తులపై విచారణ జరపాలి
- ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ నిగ్గు తేల్చాలి
- సీబీఐ లేదా జ్యుడీషియల్ విచారణకు విజ్ఞప్తి

2

రాహుల్ బైక్ వెంట పరుగులేంటి?

కాంగ్రెస్ నేతలపై కేటీఆర్ సెటైర్లు

- గాంధీ కుటుంబానికి రేవంత్ బాడీగార్డా?
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని మరిచారా?
- జాతీయ పార్టీల తీరుపై కేటీఆర్ ఫైర్

2



కొండగట్టులో నిజరూప దర్శనం

60 ఏళ్ల తర్వాత అరుదైన ఘట్టం

- నవంబర్ 15 నుంచి చందనోత్సవం
- 40 రోజుల పాటు నిజరూప దర్శనం
- భక్తుల కోసం భారీ ఏర్పాట్లు



ముద్ర, తెలంగాణ బ్యూరో :
జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న భక్తులకు ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమవుతోంది. సుమారు ఆరు దశాబ్దాల (60 ఏళ్ల) తర్వాత అంజన స్వామి నిజరూప దర్శనం కల్పించే అరుదైన కార్యక్రమానికి వేళయింది. నవంబర్ 15 నుంచి 20 వరకు కొండగట్టులో అత్యంత వైభవంగా చందనోత్సవ మహా సంప్రోక్షణ వేడుకలు ప్రారంభమయ్యాయి. దశాబ్దాలుగా స్వామి వారి మూలవిరాట్టుకు పూస్తున్న చందనపు పొరలను ప్రత్యేక పద్ధతిలో తొలగించే బృహత్తర కార్యక్రమం నేటి నుంచి మొదలైంది.

40 రోజుల పాటు దర్శన భాగ్యం

ఆరు దశాబ్దాలుగా స్వామివారి అలిమేరుపై పేరుకుపోయిన చందనపు పొరలను శాస్త్రోక్తంగా తొలగించిన అనంతరం భక్తులకు అంజన్న నిజరూప దర్శనం లభించనుంది. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 29 వరకు సుమారు 40 రోజుల పాటు భక్తులు స్వామివారి నిజరూపాన్ని కళ్లారా వీక్షించి తరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ అరుదైన ఆధ్యాత్మిక ఘట్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు కొండగట్టుకు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ చారిత్రాత్మక ఉత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను ఆలయ అధికారులు పకడ్బందీగా చేపట్టారు. ఈ మహా సంప్రోక్షణ మహోత్సవాలకు ముఖ్యమంత్రి సహా పలువురు ప్రముఖులకు ఇప్పటికే ప్రత్యేకంగా ఆహ్వాన పత్రికలు అందజేశారు. దశాబ్దాల తర్వాత అంజన్న నిజరూపాన్ని దర్శించుకునే భాగం కలగనుండటంతో భక్తుల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది.



ఎరుపెక్కిన నల్లగొండ

ఎర్రజెండాల హోరు.. నినాదాల జోరు..

- రైతు మహాప్రదర్శనతో దద్దరిల్లిన నల్లగొండ.. ఎటుచూసినా ఎర్రసైన్యమే
- నాటి సాయుధ పోరాట స్ఫూర్తి.. నేడు రైతాంగ మహాప్రదర్శన రూపంలో ప్రతిధ్వని
- నాలుగు కిలోమీటర్ల మేర కదం తొక్కిన రైతాంగం.. విప్లవాల ఖిల్లాపై ఎర్రజెండాల ప్రభంజనం


2

నేటి నుంచి నామినేషన్లు

- నేటి నుంచి 17వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- నవంబరు 26న పోలింగ్..
- అదే రోజు ఫలితాలు
- భద్రతను కట్టుదిట్టం చేసిన పోలీసులు

2





తెలంగాణకు తుపాన్ ముప్పు

భారీ వర్షాలు!

- 20 నుంచి 22 వరకు వర్ష సూచన..
- ఆరు జిల్లాలకు భారీ వర్ష హెచ్చరికలు..
- అప్రమత్తంగా ఉండాలంటూ సూచన..
- ధాన్యం రైతులకు తుపాన్ టెన్షన్..

2

పించన్ల పండుగ

కొత్తగా 4.63 లక్షల మందికి పించన్లు

- నవంబర్ 19న ఖాతాల్లోకి నగదు
- 45 లక్షలకు చేరనున్న పింఛన్‌దారులు
- దీపావళి కానుకగా చేయూత పింఛన్లు
- 18లోగా మంజూరు పత్రాల పంపిణీ
- వితంతువులకే అత్యధిక పింఛన్లు
- ఆధార్ లింకింగ్ తప్పనిసరి..
- అధికారుల సూచన

ముద్ర, హైదరాబాద్:
తెలంగాణలో పింఛన్‌దారులకు ప్రభుత్వం దీపావళి కానుక అందించింది. 'చేయూత' పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4,63,857 మందికి పింఛన్లు మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీపావళి సందర్భంగా మంజూరు పత్రాల పంపిణీని ప్రారంభించగా.. ప్రస్తుతం నియోజకవర్గాలు, మండలాల వారీగా మంత్రులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు పత్రాలను అందజేస్తున్నారు. ఈ ప్రక్రియను నవంబర్ 18వ తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.
మరోవైపు కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు నవంబర్ 19న తొలి నెల పింఛన్ సొమ్మును అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నగదు బదిలీ చేయనున్నారు. ఇందుకోసం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అవసరమైన ఏర్పాట్లు చేయగా.. ఆర్థిక శాఖ అదనపు నిధులను విడుదల చేసింది.
కొత్తగా పింఛన్లు పొందనున్న వారిలో అత్యధికంగా 2,77,894 మంది వితంతువులు ఉన్నారు. వీరితో పాటు 1,00,224 మంది దివ్యాంగులు, 53,844 మంది ఒంటరి మహిళలు, 27,444 మంది గీత కార్మికులు, 4,451 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో సుమారు 40.44 లక్షల మంది పింఛన్లు పొందుతుండగా.. కొత్తగా మరో 4.63 లక్షల మంది చేరడంతో మొత్తం లబ్ధిదారుల సంఖ్య దాదాపు 45 లక్షలకు చేరనుంది. అయితే పింఛన్ నగదు జమ కావడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్ (NPCI లింకింగ్) తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఇదీ AI ముద్ర



టీమిండియా సంచలన విజయం

వన్డే సిరీస్ కైవసం..

- కివీస్ ఏడేళ్ల రికార్డుకు బ్రేక్
- చివరి వన్డేలో 22 పరుగుల తేడాతో గెలిచిన టీమిండియా
- సొంతగడ్డపై కివీస్ 7 ఏళ్ల సిరీస్ విజయాల రికార్డుకు బ్రేక్

2





సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
సోమవారం, 16 నవంబర్, 2026


షుగర్ లెవల్స్‌కు చెక్!

బార్లీలో ఉండే కరిగే పీచు పదార్థం గ్లూకోజ్ శోషణను నెమ్మదింపజేస్తుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా నియంత్రించడంలో తోడ్పడుతుంది.



పంచాయతీ ఎన్నికల సందడి

ముద్ర, హైదరాబాద్:
ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, తొలి విడత ఎన్నికల ప్రక్రియలో భాగంగా నేటి (నవంబర్ 15) నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. మొదటి దశలో అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని పలు మండలాల్లో ఎన్నికలు జరగనుండగా, ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగాలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. తొలి విడతలో భాగంగా అనంతపురం జిల్లాలోని కల్యాణదుర్గం, అనంతపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 13 మండలాల్లోనూ, కర్నూలు జిల్లాలోని ఆదోని, పత్తికొండ డివిజన్ల పరిధిలోని 8 మండలాల్లోనూ ఎన్నికలు నిర్వహించనున్నారు. అభ్యర్థులు నవంబర్ 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. 18న నామినేషన్ల పరిశీలన చేపట్టనుండగా, 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు గడువు ఉంటుంది. అనంతరం అదే రోజు అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. నవంబర్ 26న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. పోలింగ్ ముగిసిన వెంటనే మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు. అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియను కూడా పూర్తి చేస్తారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు. నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థితో పాటు మరో ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ర్యాలీలు, ఊరేగింపులపై ఆంక్షలు విధించామని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయన్నారు.



తెలంగాణకు మోదీ సాయం కోరిన రేవంత్!



(మొదటి పేజీ తరువాయి)
దీంతో పాటు రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ప్రధాని దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లారు. 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర నుంచి, సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి సమ్మతి ఇప్పించాలని కోరినట్లు తెలుస్తోంది. అలాగే గోదావరి – కావేరీ నదుల అనుసంధానం ప్రాజెక్టును సమ్మక్కసాగర్ లేదా ఇచ్చంపల్లి నుంచి చేపట్టాలని, ఈ ప్రాజెక్టు ద్వారా తరలించే జలాల్లో 50 శాతం వాటాను తెలంగాణకు కేటాయించాలని విజ్ఞప్తి చేయనున్నారు. సీతమ్మసాగర్ బ్యారేజీకి త్వరిత గతిన పర్యావరణ అనుమతులు లభించేలా చొరవ తీసుకోవాలని కూడా ప్రధానిని కోరినట్లు సమాచారం. తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభోత్సవం లేదా ముగింపు వేడుకల్లో పాల్గొనాలని ప్రధానిని సీఎం రేవంత్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు.

మరణశిక్ష రద్దు వద్దు



ముద్ర, న్యూఢిల్లీ :
ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం (యూఎన్‌జీఏ) థర్డ్ కమిటీలో మరణశిక్షల అమలుపై ప్రపంచవ్యాప్త తాత్కాలిక నిషేధం విధించాలంటూ ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానానికి వ్యతిరేకంగా భారత్ ఓటు వేసింది. మెక్సికో ప్రతిపాదించిన ఈ తీర్మానానికి అనుకూలంగా 133 దేశాలు ఓటు వేయగా, భారత్‌తో సహా 33 దేశాలు వ్యతిరేకించాయి. 16 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయని దిహిందూ కథనం పేర్కొంది.
న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఐరాసలోని భారత శాశ్వత మిషన్ ఫస్ట్ సెక్రటరీ భవిక మంగళానందన్ దేశ వైఖరిని స్పష్టం చేశారు. మరణశిక్షలకు సంబంధించి ప్రపంచ దేశాల మధ్య ఎలాంటి ఏకాభిప్రాయం లేదని ఆమె పేర్కొన్నారు. ప్రతి సార్వభౌమ దేశానికి తమ సొంత న్యాయ వ్యవస్థను, తగిన శిక్షలను నిర్ణయించుకునే పూర్తి హక్కు ఉంటుందని తెలిపారు. భారత్‌లో సరైన న్యాయ ప్రక్రియను, విస్తృతమైన రక్షణలను అనుసరించిన తర్వాతే కేవలం 'అత్యంత అరుదైన కేసుల్లో' (రేరెస్ట్ ఆఫ్ రేర్) మాత్రమే మరణశిక్ష విధిస్తామని ఆమె వివరించారు. చట్టబద్ధమైన విచారణ అనంతరం విధించే మరణశిక్షను అన్యాయమైన హత్యలతో లేదా హింసతో పోల్చడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని భారత్ స్పష్టం చేసింది. ఈ తీర్మానాన్ని భారత్‌తో పాటు అమెరికా, చైనా, జపాన్, పాకిస్థాన్, ఇరాన్, సౌదీ అరేబియా వంటి దేశాలు కూడా వ్యతిరేకించాయి. తమ దేశ చట్టాలకు లోబడి, న్యాయ సమీక్షల ద్వారానే తీవ్రమైన నేరాలకు శిక్షలు అమలు చేస్తామని భారత్ మరోసారి తేల్చిచెప్పింది.



ఎరుపెక్కిన నల్లగొండ

ముద్ర, నల్లగొండ :
నల్లగొండ జిల్లా విప్లవాల ఖిల్లాగా వేరుగాంచిన నల్లగొండ జిల్లా కేంద్రం మరోమారు ఎర్రజెండాల రెపరెపలతో, రైతు నినాదాలతో ఎరుపెక్కింది. ఎన్నో ఉద్యమాలకు ఊపిరిపోసిన ఖిల్లా... చరిత్రలో ఎన్నో ప్రజా పోరాటాలకు వేదికైన నల్లగొండ మరోసారి ఎర్రజెండాల రెపరెపలతో పులకించిపోయింది. అడుగడుగునా రైతాంగ ఉత్సాహం.. వీధివీధినా విప్లవ నినాదాల హోరు.. ఎటుచూసినా ఎర్రజెండాల సందడితో జిల్లా కేంద్రం అట్టుడికిపోయింది. అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభల సందర్భంగా నల్లగొండ పట్టణంలో అదివారం నిర్వహించిన రైతుల మహాప్రదర్శన అట్టహాసంగా సాగింది. వేలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని తమ ఐక్యతను చాటుకున్నారు. ఈ మహాప్రదర్శనతో పట్టణ వీధులన్ని ఎర్రజెండాల రెపరెపలతో ఎరుపెక్కాయి. రైతాంగ ఐక్యతను చాటుతూ సాగిన ఈ మహాప్రదర్శనలో సంప్రదాయ కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆదివాసీల సంప్రదాయ దింసా నృత్యాలు అడుగడుగునా ఉత్సాహాన్ని నింపగా, కోలాటాల లయబద్ధమైన అడుగులు, చెక్కభజనల హోరు, డీజే సప్పుల దరువులతో పట్టణ వీధులు మారుమోగాయి. ఎర్రజెండాలు చేతబూనిన రైతులు, కార్మికులు, ప్రజాసంఘాల ప్రతినిధుల వినాదాలతో నల్లగొండ పురవీధులు ఉద్యమ గీతాన్ని ఆలపించాయి. ముఖ్యంగా కార్పొరేట్ శక్తుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా రూపొందించిన వినూత్న ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వ్యవసాయ రంగంపై కార్పొరేట్ పెత్తనాన్ని ప్రశ్నిస్తూ రూపొందించిన ప్రదర్శనలు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లకు కట్టినట్లు చూపించాయి. మొత్తంగా రైతు మహాప్రదర్శనతో నల్లగొండ పట్టణం పండుగ వాతావరణాన్ని తలపించగా, ఎర్రజెండాల నినాదాలు, కళారూపాలు, రైతాంగ ఐక్యత అఖిల భారత రైతు సంఘం మహాసభలకు ప్రత్యేక ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి.
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి పురిటిగడ్డగా, భూమి కోసం భుక్తి కోసం సాగిన మహత్తర పోరాట చరిత్రకు సాక్షిగా నిలిచిన నల్లగొండ జిల్లా మరోసారి రైతాంగ ఉద్యమానికి నాంది. పలికేందుకు సిద్ధమైంది. ఒకప్పుడు పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన వీర తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తిని చాటుతూ నల్లగొండ పట్టణంలో నిర్వహించిన రైతాంగ మహాప్రదర్శన చరిత్రలో నిలిచిపోయేలా సాగింది. మర్రిగూడ బైపాస్ నుంచి ఎన్జీ కళాశాల వరకు సాగిన ఈ భారీ ప్రదర్శన రైతాంగ ఐక్యతను, పోరాట స్ఫూర్తిని చాటిచెప్పింది. సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రెండు గంటలకు పైగా సాగిన ఈ ప్రదర్శన పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఆదివాసీ, గిరిజనుల సంప్రదాయ నృత్యాలు, మహిళల కోలాటాలు, పురుషుల చిరుత భజనలు, డీజే సప్పులు, దప్పు చప్పుళ్లతో నల్లగొండ పట్టణం మార్మోగిపోయింది. ప్రదర్శనకు ముందు వరుసలో రెడ్ షర్ట్ వాలంటీర్లు నిర్వహించిన కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్రమశిక్షణతో సాగిన వారి కవాతు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఎర్ర బండ్ల ప్రదర్శన గ్రామీణ రైతాంగ సంస్కృతిని ప్రతిబింబిస్తూ పట్టణ ప్రజల హృదయాలను దోచుకుంది. మరోవైపు కార్పొరేట్ శక్తులకు, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన గళం వినిపిస్తూ అంబానీ, అదానీ, మోదీ పేర్లతో ఏర్పాటు చేసిన భారీ దిష్టిబొమ్మను రైతులు దగ్ధం చేశారు. రైతుల సమస్యలు, కార్పొరేట్ ఆదిపత్యం, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై తమ నిరసనను ఈ సందర్భంగా చాటిచెప్పారు.

ఆదివాసీ దింసా నృత్యాలు, కోలాటాలు, ఎర్రబండ్ల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ

అఖిల భారత రైతు సంఘం మహాసభల సందర్భంగా నిర్వహించిన రైతుల మహాప్రదర్శన నల్లగొండ పట్టణంలో కనువిందు చేసింది. ఈ మహాప్రదర్శనలో ఆదివాసీల సంప్రదాయ దింసా నృత్యాలు, కోలాటాలు, చెక్కభజనలు, డీజే సప్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎర్రజెండాలు చేతబూని రైతులు చేసిన నినాదాలతో నల్లగొండ పట్టణ వీధులు మారుమోగాయి. ఇక గ్రామీణ వ్యవసాయ సంస్కృతికి అద్దం పట్టిన ఎడ్లబండ్ల ప్రదర్శన సంప్రదాయ కళారూపాలు, రైతాంగ పోరాట స్ఫూర్తి కలగలిసి మహాప్రదర్శనకు ప్రత్యేక శోభను తీసుకొచ్చింది. సంప్రదాయాన్ని, రైతుల సంస్కృతి, గ్రామీణ జీవన విధానం, వ్యవసాయ వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ అలంకరించిన ఎడ్లబండ్లు వీధుల్లో సాగుతుంటే చూపరులు ఆసక్తిగా తిలకించారు. ఆధునిక ప్రదర్శనల నడుమ పల్లె జీవన పరిమళాలను గుర్తుచేసిన ఎడ్లబండ్ల సందడి. అందరినీ ఆకట్టుకుంది. ఒకవైపు ఆదివాసీ కళా వైభవం.. మరోవైపు రైతాంగ పోరాట స్ఫూర్తి.. ఇంకోవైపు ఎర్రజెండాల రెపరెపలు.. వీటన్నింటి కలయికతో నల్లగొండలో రైతు మహాప్రదర్శన అద్భుత దృశ్యంగా ఆవిష్కృతమైంది. పోరాటాల ఖిల్లా నల్లగొండలో రైతాంగ ఐక్యతను చాటిన ఈ మహాప్రదర్శన అఖిల భారత రైతు సంఘం మహాసభలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ప్రదర్శన కేవలం ఊరేగింపుగా కాకుండా, రైతాంగ హక్కుల కోసం భవిష్యత్తులో సాగబోయే ఉద్యమాలకు సంకేతంగా నిలిచింది.

మహా ప్రదర్శనకు ఘన స్వాగతం..

రైతాంగ అగ్రనాయకులు ముందుండి నడిపించగా, వేలాదిగా తరలివచ్చిన రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ రైతాంగ మహా పాదర్శనకు నల్లగొండ పట్టణంలోని పలు ప్రజాసంఘాలు ఘన స్వాగతం పలికాయి. యుటీఎఫ్, సీఐటీయు, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐలాంటి ప్రజా సంఘాలు రోడ్డు వెంట నిలబడి ప్రదర్శనకు స్వాగతం లుకుతూ పూలవర్షం కురిపించారు.

సజ్జనార్‌పై సీబీఐ దర్యాప్తు

ముద్ర, హైదరాబాద్:
గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సీఎం రేవంత్ రెడ్డి సంచలన లేఖ రాశారు. ఈ లేఖ తెలంగాణ రాజకీయ, పోలీసు వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. హైదరాబాద్ మాజీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హయాంలో జరిగిన పలు అవకతవకలు, కీలక కేసుల దర్యాప్తు తీరుపై సీబీఐ విచారణ లేదా జ్యుడీషియల్ విచారణ జరిపించాలని రాజాసింగ్ సీఎంను విజ్ఞప్తి చేశారు.

కీలక కేసుల్లో దర్యాప్తు నత్తనడక


సజ్జనార్ కమిషనర్‌గా ఉన్న సమయంలో పలు సంచలన కేసుల విచారణ సరిగ్గా జరగలేదని రాజాసింగ్ తన లేఖలో ఆరోపించారు. ముఖ్యంగా 'గోల్డ్ హెఫ్ట్' కేసులో ఇంతవరకు ఎలాంటి పురోగతి లేదని, అసలు నిందితుల అరెస్టులు ఎందుకు జరగలేదని ఆయన ప్రశ్నించారు. అలాగే, హామ్ వే కేసులోనూ దర్యాప్తు నత్తనడకన సాగుతోందని, ఈ ఆలస్యానికి కారణం ఏంటో నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. జనార్ధన్ పై చేసిన ట్వీట్ అనంతరం సజ్జనార్ వ్యవహార శైలిపై మరిన్ని అనుమానాలు బలపడ్డాయని పేర్కొన్నారు.

ఫోన్ ట్యాపింగ్

తన లేఖలో రాజాసింగ్ మరిన్ని కీలక అంశాలను ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలుగులోకి వచ్చిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రముఖ రాజకీయ నేతలు, వీఐపీలపై నిఘా పెట్టారని, ఈ కేసులో సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారి ప్రమేయంపై ఆరోపణలు ఉన్నప్పటికీ విచారణను పక్కదారి పట్టించారనే ఆందోళనలు ఉన్నాయని రాజాసింగ్ పేర్కొన్నారు. నాటి సీపీ సజ్జనార్ ఈ కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేశారా? లేదా? అనే దానిపై పారదర్శక అవసరమన్నారు.

సీబీఐ మాజీ డైరెక్టర్ ఆరోపణలు

సీబీఐ మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు గతంలో సజ్జనార్‌పై అత్యంత తీవ్రమైన ఆరోపణలు చేశారని, పోలీసు యూనిఫామ్ వెనుక దాక్కున్న నేరస్తుడి తరహా ప్రవర్తన అని వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా కేవలం బదిలీ చేసి ఎందుకు వదిలేశారని ప్రశ్నించారు. కర్ణాటకలోని సజ్జనార్ స్వగ్రామంలో లేదా దాని పరిసరాల్లో సుమారు 100 ఎకరాల భూమి కొనుగోలు చేసినట్లు ప్రచారం జరుగుతోందని, ఆయన ఆదాయానికి మించిన ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై పూర్తిస్థాయిలో తనిఖీలు జరిపించాలని రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారాలపై నిజాలు నిగ్గుతేల్చేందుకు తక్షణమే సీబీఐ లేదా జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని రాజాసింగ్ సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.



రాహుల్ బైక్ వెంట మంత్రుల పరుగులేంటి?

ముద్ర, హైదరాబాద్:
తెలంగాణ కాంగ్రెస్, భాజపా నేతల పదవులకు గౌరవం లేనట్లుందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో గిగ్ వర్కర్ల ర్యాలీ సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. గాంధీ కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి బాడీగార్డుగా మారారని విమర్శించారు. ''హైదరాబాద్ పర్యటనకు వచ్చిన రాహుల్‌గాంధీ బైక్ వెంట మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు పరుగులు తీశారు. రాహుల్ వెంట అలా పరుగులు తీయడమేంటి? గతంలో కేంద్రమంత్రి బండి సంజయ్.. అమిత్ షా చెప్పులు మోశారు. తెలంగాణ ఆత్మగౌరవం ఉన్న గడ్డ. ఈ రెండు జాతీయ పార్టీలు ఇప్పటికీ దాన్ని అర్థం చేసుకోవడం లేదు'' అని కేటీఆర్ అన్నారు.

టీమిండియా సంచలన విజయం

ముద్ర, ముంబై:
మౌంట్ మాంగనూయిలోని బే ఓవల్ వేదికగా జరిగిన ఆఖరి వన్డేలో భారత జట్టు అద్భుత పోరాట పటిమ కనబరిచింది. తక్కువ స్కోరు నమోదైన ఉత్కంఠ పోరులో న్యూజిలాండ్‌పై 22 పరుగుల తేడాతో విజయం సాధించి, వన్డే సిరీస్‌ను 3–1 తేడాతో కైవసం చేసుకుంది. ఈ విజయంతో కివీస్ గడ్డపై న్యూజిలాండ్‌కు ఉన్న సుదీర్ఘ అజేయ రికార్డుకు భారత్ తెరదించింది. గత ఏడేళ్లలో సొంతగడ్డపై వరుసగా 11 ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లను గెలుచుకున్న న్యూజిలాండ్‌కు ఇది ఊహించని షాక్. 2019 తర్వాత కివీస్ జట్టు తమ దేశంలో వన్డే సిరీస్ కోల్పోవడం ఇదే తొలిసారి కాగా, అప్పుడు కూడా భారత్ చేతిలోనే పరాజయం పాలవడం విశేషం. అంతేకాకుండా భారత హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గౌతమ్ గంభీర్‌కు విదేశాల్లో ఇదే తొలి వన్డే సిరీస్ విజయం.
210 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 48.1 ఓవర్లలో 187 పరుగులకే కుప్పకూలింది. పిచ్ పరిస్థితులను సరిగ్గా అర్థం చేసుకున్న తాత్కాలిక కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వ్యూహాత్మకంగా పేసర్లకే ఎక్కువ ఓవర్లు ఇచ్చాడు. 36వ ఓవర్ వరకు స్పిన్నర్లను తీసుకురాకుండా పేస్ ఎటాక్‌తోనే కివీస్ బ్యాటర్లను కట్టడి చేశాడు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 3 వికెట్లతో రాణించగా, సిరాజ్ 2, అక్షర్ పటేల్ 2 వికెట్లు తీశారు. అరంగేట్రం చేసిన యశ్ ఠాకూర్, ఆకిబ్ నబీ తలో వికెట్ దక్కించుకున్నారు. కీలక సమయంలో నమన్ ధీర్ కివీస్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (24) వికెట్ తీసి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు.
అంతకుముందు, టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా 42.1 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌట్ అయింది. సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ (7), విరాట్ కోహ్లీ (5) తీవ్రంగా నిరాశపరిచారు. అయితే అక్షర్ పటేల్ (46), ఇషాన్ కిషన్ (46) బాధ్యతాయుతంగా ఆడి జట్టును ఆదుకున్నారు. ఆఖర్లో మహ్మద్ సిరాజ్ (14 నాటౌట్), అర్ష్‌దీప్ సింగ్ (14) చివరి వికెట్‌కు జోడించిన 28 పరుగులు మ్యాచ్ ఫలితంలో అత్యంత కీలకంగా మారాయి.

తెలంగాణకు తుపాన్ ముప్పు

ముద్ర, తెలంగాణ బ్యూరో:
బంగాళాఖాతంలో ఏర్పడనున్న అక్వాన్ తుపాన్ కారణంగా తెలుగు రాష్ట్రాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉండనుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ తుఫాను ప్రభావంతో ఈ నెల 20వ తేదీన ఉత్తర కోస్తా తీరాన్ని దాటే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీనివల్ల తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలలో వాతావరణం పూర్తిగా మారిపోయి వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ అయ్యాయి. 20 నుంచి 22వ తేదీ వరకు రాష్ట్రంలోని తూర్పు మరియు దక్షిణ జిల్లాలలో వాతావరణం మారుతుందని, వర్షాల తీవ్రత ఉంటుందని అంచనా వేస్తున్నారు.
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ అలాగే నాగర్ కర్నూల్ జిల్లాలలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత జిల్లాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు వెలువడ్డాయి. ఇదే విధంగా 21, 22 తేదీలలో రాష్ట్రంలోని మిగతా జిల్లాలలో కూడా తుఫాను ప్రభావం కొంతవరకు కనిపించే అవకాశం ఉంది. ఆయా ప్రాంతాలలో ఆకాశం మేఘావృతమై ఉండి కొన్ని చోట్ల మోస్తరు వర్షాలు కురిసే ఆస్కారం ఉంది.
ప్రస్తుతం రాష్ట్రంలో చలి తీవ్రత అధికంగా ఉన్న తరుణంలో, ఈ తుఫాను రాకతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో కోతలు, ధాన్యం కొనుగోళ్ల దశ కొనసాగుతున్నందున, వర్ష సూచన నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అకస్మాత్తుగా మారే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తగు ముందస్తు రక్షణ చర్యలు పాటించడం ద్వారా పంట నష్టాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 16.11.2026
www.mudranews.in | @mudranews

గుండె ఆరోగ్యానికి మేలు!

బార్లీలోని బీటా గ్లూకాన్ చెడు కొలెస్ట్రాల్ (LDL) తగ్గించడంలో సహాయపడుతుంది. దీంతో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ఉపయోగపడుతుంది.



చంద్రబాబును కలిసిన వైఎస్ షర్మిలా రెడ్డి



ముద్ర ప్రతినిధి, హైదరాబాద్ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన కుమార్తె వైఎస్ అంజిలి రెడ్డి వివాహ వేడుకకు హాజరై, కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ చంద్రబాబు నాయుడుకు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ వివాహ వేడుకకు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించాలని ఆమె ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ - 2026 లోగో, మస్కట్ ఆవిష్కరణ

న్యూఢిల్లీలో ఆవిష్కరించిన కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా
డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో ఎనిమిదో ఎడిషన్ పోటీలు
ప్రారంభోత్సవానికి రావాలని ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానం
సానుకూలంగా స్పందించిన ప్రధాని

ముద్ర ప్రతినిధి, న్యూఢిల్లీ : తెలంగాణ వేదికగా డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఎనిమిదో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ – 2026 లోగో, మస్కట్‌ను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా ఆవిష్కరించారు. న్యూఢిల్లీలోని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, క్రీడల ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎండీ డాక్టర్ ఏ. సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా నేతృత్వంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసింది. ఎనిమిదో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ, లోగో, మస్కట్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఏర్పాట్లను ప్రధానమంత్రికి వివరించింది. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సంసిద్ధతతో ఉందని వివరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిసెంబర్ 11న జరిగే ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై ప్రధాని సానుకూలంగా స్పందించినట్లు రాష్ట్ర ప్రతినిధి బృందం వెల్లడించింది. యూత్ గేమ్స్ నిర్వహణ కోసం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లు, చూపుతున్న చొరవపై కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రతినిధి బృందాన్ని అభినందించారు. ఈ క్రీడా సంబరాల ద్వారా దేశ యువ క్రీడాకారులకు తెలంగాణ గొప్ప వేదికగా నిలవనుంది.

ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో అగ్రగామిగా తెలంగాణ

డిజైన్, ఇంజినీరింగ్, నాణ్యతా పరీక్షలు, ధ్రువీకరణ, పరిశోధనపై ప్రత్యేక దృష్టి
హైదరాబాద్ లో ఎన్ డీఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సానుకూలం
'ఎన్‌డీఈ–2026' జాతీయ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు



ముద్రప్రతినిధి, హైదరాబాద్ : ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కేవలం తయారీ రంగానికే పరిమితం కాకుండా... డిజైన్, ఇంజినీరింగ్, నాణ్యతా పరీక్షలు, ధ్రువీకరణ, పరిశోధన తదితర విభాగాలనూ రాష్ట్రంలో మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఇండియన్ సొసైటీ ఫర్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ (ఐఎస్ఎన్‌టీ) ఆధ్వర్యంలో ఆదివారం హైటెక్స్ లో నిర్వహించిన 'నాన్ డిస్ట్రక్టివ్ ఎవాల్యుయేషన్ అండ్ ఎనేబ్లింగ్ టెక్నాలజీస్ (ఎన్‌డీఈ–2026)' జాతీయ సదస్సులో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... గ్లోబల్ సప్లై చైన్‌లో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్‌కు మరింత గుర్తింపును తీసుకొచ్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఆ దిశగా తయారీ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లోని అవకాశాలను అందిపుచ్చుకునేలా స్థానిక పరిశ్రమలను గ్లోబల్ మార్కెట్ తో అనుసంధానం చేస్తున్నామన్నారు. విమానాలు, హెలికాప్టర్లు, ఇతర ఏరోస్పేస్, డిఫెన్స్ పరికరాల నాణ్యత, భద్రత, విశ్వసనీయతను నిర్ధారించడంలో ఎన్ డీఈ నిపుణుల పాత్ర కీలకమన్నారు. అడ్వాన్స్డ్ మెటీరియల్స్, ఎమర్జింగ్ టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్న కొద్దీ వాటిని పరీక్షించే విధానాలు కూడా మారాలన్నారు. మరింత కచ్చితమైన ఫలితాల కోసం ఏఐ, డిజిటల్ ట్విన్స్, అడ్వాన్స్డ్ ఇన్ స్పెక్షన్ పద్ధతుల వినియోగం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఎన్ డీఈ నిపుణులకు మరింత డిమాండ్ ఉండనుందని, ఆ దిశగా తెలంగాణ యువతను 'రెడీ టూ వర్క్ ఫోర్స్' గా తీర్చిదిద్దేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ఐఎస్ఎన్ టీ, పరిశ్రమలు, యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలు ముందుకు రావాలని కోరారు. హైదరాబాద్‌లో ఎన్ డీఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలన్న ఐఎస్ఎన్ టీ విజ్ఞప్తిపై మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐఎస్ఎన్ టీ ప్రెసిడెంట్ డా.జైతీష్ ఆర్ జోషి, ఎన్ డీ ఈ 2026 చైర్మన్ సూర్య ప్రకాష్ గజ్జల, కన్వీనర్ మోహన్ పి నాయర్, మిధాని సీఎండీ డా.ఎస్వీఎస్ నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు–రంగారెడ్డి, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు
పర్యావరణ అనుమతులు వేగవంతం చేయాలి

-తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల నీటిమట్టానికి మహారాష్ట్ర అంగీకారం ఇప్పించాలి
-ప్రధాని మోదీతో భేటీలో తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులు, నిధులపై సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి



ముద్ర ప్రతినిధి, న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీతో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి భేటీ అయ్యారు. నవంబర్ 22వరకు తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు హాజరుకావాలని ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ భేటీలో రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పర్యావరణ అనుమతులు, అంతర్రాష్ట్ర జల వివాదాలు, కేంద్ర నిధులు, భూగర్భ జలాల పరిరక్షణ తదితర అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. భేటీ అనంతరం న్యూఢిల్లీలో సహచర మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరాలు వెల్లడించారు.

అనుమతుల్లో జాప్యం తొలగించాలి..

పాలమూరు–రంగారెడ్డి, సీతమ్మసాగర్, డిండి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రధానిని కోరినట్లు ఉత్తమ్ తెలిపారు. ఈ మూడు ప్రాజెక్టులపై గత, ప్రస్తుత ప్రభుత్వాలు కలిపి సుమారు రూ.50వేల కోట్లు ఖర్చు చేశాయని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చినప్పటికీ పర్యావరణ అనుమతుల దరఖాస్తుల పరిశీలనలో జాప్యం కొనసాగుతోందని వివరించారు. దేశవ్యాప్తంగా అనుమతుల కారణంగా నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టుల సమస్యల పరిష్కారానికి ప్రధాని చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల నీటిమట్టానికి అంగీకారం కోరాం

తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల పూర్తి స్థాయి నీటిమట్టం నిర్వహణకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించేలా చూడాలని ప్రధానిని కోరినట్లు ఉత్తమ్ వెల్లడించారు. ఈ ప్రాంత ప్రాధాన్యతను పూర్తి గణాంకాలతో వివరించామని, అదనపు ముంపునకు సంబంధించి మహారాష్ట్రకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని స్పష్టం చేసినట్లు తెలిపారు. సమ్మక్క–సారలమ్మ బ్యారేజీ నిర్మాణానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి అవసరమైన నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) త్వరగా ఇప్పించాలని ప్రధానిని కోరినట్లు చెప్పారు. ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి ముంపు నివేదిక తెప్పించామని, అదనపు డీపీఆర్ కోసం కోరిన మొత్తాన్ని కూడా జమ చేశామని తెలిపారు. సమ్మక్క–సారలమ్మ డీపీఆర్‌ను సమర్పించిన నాటి నిబంధనల ప్రకారమే పరిశీలించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 16న కేంద్ర జల సంఘం చైర్మన్‌ను కలవనున్నట్లు, 17న ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రితో సీఎం రేవంత్‌రెడ్డి, తాను సమావేశం కానున్నట్లు ఉత్తమ్ వెల్లడించారు.

సాగునీటి పథకాలకు రూ.5,856 కోట్ల ప్రతిపాదనలు

2027–28 ఆర్థిక సంవత్సరంలో ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన కింద నాలుగు సాగునీటి పథకాలకు రూ. 5,856 కోట్ల నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. సీతమ్మసాగర్–సీతారామ సమీకృత పథకం కింద రూ.5,183 కోట్లు నిధులు, మోడి కుంట వాగు రూ.392 కోట్లు, చిన్న కాళేశ్వరం రూ.178 కోట్లు, చనాకా–కొరాట రూ.103 కోట్ల నిధులు, మొత్తంగా రూ.5,856 కోట్ల నిధులను కేటాయించాలని కోరారు. రాష్ట్రాలకు కేంద్రం ప్రకటించిన 50 ఏళ్ల వడ్డీలేని రుణాల కింద తెలంగాణకు ఇప్పటివరకు రూ.1,457 కోట్లు అందాయని ఉత్తమ్ తెలిపారు. 70 నుంచి 90 శాతం వరకు పనులు పూర్తయిన సాగునీటి ప్రాజెక్టుల తుది పనుల కోసం అదనంగా రూ.5 వేల కోట్ల నిధులు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. ఈ నిధులు మంజూరైతే 2027 మార్చి 31లోగా వాటిని పూర్తిగా వినియోగించి, ఏడాదిలోగా కొత్త ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని వివరించారు.

భూగర్భ జలాల పెంపునకు రూ.5 వేల కోట్ల ప్రత్యేక సాయం..

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం, రాష్ట్రంలో పడిపోతున్న భూగర్భ జలమట్టాలపై కూడా ప్రధానికి వివరించినట్లు ఉత్తమ్ తెలిపారు. కేంద్ర భూగర్భ జల మండలి సెప్టెంబర్ నివేదిక ను ప్రధానికి అందజేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో భూగర్భ జలాల పెంపు, పరిరక్షణకు స్వల్ప కాలిక, దీర్ఘకాలిక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.5 వేల కోట్ల ఆర్థిక సాయం అందించాలని కోరినట్లు వెల్లడించారు. వచ్చే వానాకాలం వరకు తాగునీటి అవసరాలకు సరిపడా నీటి నిల్వలను రిజర్వాయర్లలో ఉంచామని చెప్పారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ యాసంగి సీజన్‌లో వరి సాగు చేయవద్దని రైతులకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

విజ్ఞప్తులపై ప్రధాని సానుకూల స్పందన

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తావించిన సాగునీటి ప్రాజెక్టులు, ఆర్థిక సాయం, పర్యావరణ అనుమతులు, భూగర్భ జలాల పరిరక్షణ అంశాలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లామని, తెలంగాణ విజ్ఞప్తులను పరిశీలిస్తామని ప్రధాని సానుకూలంగా స్పందించారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాదు..

ప్రస్తుత పరిస్థితుల్లో మేడిగడ్డ బ్యారేజీ నుంచి నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాదని నిపుణులు స్పష్టం చేసినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఒకే తరహా సీకెంట్ పైల్ పునాదులు ఉన్నాయని, ఈ మూడు బ్యారేజీల పునాదుల రూపకల్పన, నిర్మాణంలో లోపాలు ఉన్నట్లు నిపుణుల నివేదికలు పేర్కొన్నాయని వివరించారు. గత ప్రభుత్వ హయాంలోనే మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్నదని, ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడి నుంచి నీటిని ఎత్తిపోయాలని కోరడం అర్థరహితమని వ్యాఖ్యానించారు.

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుపై విమర్శలు

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు కోసం గతంలో రూ.11 వేల కోట్లు ఖర్చు చేసి, 30 శాతం పనులు పూర్తయిన తర్వాత దానిని మేడిగడ్డ వైపు మళ్లించారని ఉత్తమ్ ఆరోపించారు. కమిషన్ల కోసమే గత ప్రభుత్వం ప్రాజెక్టును మళ్లించిందని విమర్శించారు. దిగువ ప్రాంతాల్లో దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నామని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు, నిధుల సాధనతోపాటు అంతర్రాష్ట్ర సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం

-పరిశ్రమల స్థాపనకు భూములు, ప్రోత్సాహకాలు అందిస్తాం: డిప్యూటీ సీఎం భట్టి
-యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
-సామాజిక చైతన్యానికి జయరాజు వంటి కళాకారుల సేవలు చిరస్మరణీయం

ముద్ర ప్రతినిధి, మహేశ్వరం : తెలంగాణలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూములు, రాయితీలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలను అర్హులైన పారిశ్రామికవేత్తలకు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో ప్రముఖ కవి, వాగ్గేయకారుడు జయరాజుకు సంబంధించిన ఎన్ఎస్ ఇండస్ట్రీస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆదివారం ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయంగా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, పరిశ్రమలు స్థాపించి మరింత మందికి ఉపాధి కల్పించాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ ఇండస్ట్రీస్‌ను స్థాపించిన యువ పారిశ్రామికవేత్తలు నిశాంత్, సాజన్ ఉన్నత విద్యాభ్యాసం అనంతరం ఉద్యోగాలపై ఆధారపడకుండా సొంతంగా పరిశ్రమ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పది మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో వారు చేస్తున్న ప్రయత్నం మరెందరో యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. పరిశ్రమ స్థాపనకు అవసరమైన పారిశ్రామిక ప్రాంతంలో స్థలం కేటాయించేందుకు ప్రభుత్వం సహకరించిందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు స్థాపించాలని భావించే యువతకు నిశాంత్, సాజన్ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

జయరాజు సేవలు చిరస్మరణీయం..

ప్రముఖ కవి, వాగ్గేయకారుడు జయరాజు సమాజానికి అందించిన సేవలను ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే తన కళను సమాజ హితం కోసం వినియోగించడం గొప్ప విషయమన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలు, శ్రమజీవుల హక్కులు, అణగారిన వర్గాల జీవితాలను తన పాటల ద్వారా ప్రతిబింబిస్తూ ప్రజల్లో సామాజిక చైతన్యం తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఆయన రచించిన పాటలు ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చాయని అన్నారు. కళాకారులు, మేధావులు, సామాజిక చైతన్యం కోసం కృషి చేసే వ్యక్తులను గుర్తించి గౌరవించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.



సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం..

పాలకులు అధికారాన్ని హోదాగా భావించకుండా ప్రజల సంక్షేమం, సమాజ హితం కోసం పనిచేయాలని భట్టి విక్రమార్క సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సామాజిక న్యాయం, సమానత్వం, అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. పారిశ్రామిక అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉన్న చెట్లను తొలగించకుండా ప్రకృతిని కాపాడుతూ పరిశ్రమను అభివృద్ధి చేయాలనే ఎన్ఎస్ ఇండస్ట్రీస్ నిర్వాహకుల ఆలోచనను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నరేందర్ రావు, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న లక్ష్మారెడ్డి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, డిక్కీ అధ్యక్షుడు నర్రా రవికుమార్, ఎస్సీడీసీఎల్ డైరెక్టర్ శివాజీ, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాలరాసిన చరిత్ర కాంగ్రెస్‌దే

- భారత్ సమ్మిట్‌పై రాంచందర్ రావు విమర్శలు

ముద్ర ప్రతినిధి, హైదరాబాద్, : ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని గతంలో కాంగ్రెస్ పార్టీనే కాలరాసిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. 'ఓట్ చోర్', 'సంవిధాన్ చోర్' కాంగ్రెస్ పార్టీయేనని ఆరోపించారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ నిర్వహించిన భారత్ సమ్మిట్ పేరుతో విదేశీ శక్తులను ఆహ్వానించి భారతదేశ ప్రతిష్ఠను దెబ్బతీశారని మండిపడ్డారు. దేశ సార్వభౌమాధికారాన్ని ప్రశ్నించే వ్యాఖ్యలను సహించబోమని, రాహుల్ గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ బీజేపీ ఆల్ సెల్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

పార్టీ బలోపేతంలో సెల్స్ కీలకం..

పార్టీ నిర్మాణంలో వివిధ విభాగాలు (సెల్స్) కీలక పాత్ర పోషిస్తాయని రాంచందర్ రావు తెలిపారు. బీజేపీలో జాతీయ స్థాయిలో 22 అధికారిక సెల్స్ ఉన్నాయని, రాష్ట్ర అవసరాలకు అనుగుణం గా మరో ఐదారు విభాగాలను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని వివరించారు. ఎక్స్ సర్వీస్‌మెన్, అడ్వకేట్స్, ట్రేడర్స్, ఐటీ, సోషల్ మీడియా, టీచర్స్, ఎడ్యుకేషన్, డాక్టర్స్, కల్చరల్ సెల్స్ ద్వారా వివిధ వృత్తులకు చెందిన నిపుణులను పార్టీతో అనుసంధానం చేయాలని సూచించా రు.రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అన్ని విభాగాల సభ్యులు ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. బూత్ స్థాయి నుంచి ఎమ్మె ల్సీ ఎన్నికల వరకు అన్ని విభాగాలు సమ న్వయంతో పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

ఏపీ తీరంవైపు 'అక్వాన్'తుఫాన్

-తెలంగాణలోనూ వర్షాలు!
-19న చెన్నై–బాపట్ల మధ్య తీరాన్ని దాటే అవకాశం?

ముద్ర ప్రతినిధి, హైదరాబాద్: బంగాళాఖాతంలో నవంబర్ 16–17 తేదీల్లో 'అక్వాన్' తుఫాన్ ఏర్పడే అవకాశం ఉందని ఒక వాతావరణ అంచనా వెలువడింది. ఈ తుఫాన్ నవంబర్ 19న చెన్నై–బాపట్ల మధ్య, ప్రధానంగా దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో నవంబర్ 20 నుంచి 22 వరకు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. తుఫాన్ ప్రభావంతో నవంబర్ 20, 21 తేదీల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో



మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇక హైదరాబాద్‌తో పాటు మిగిలిన తెలంగాణ జిల్లాల్లో నవంబర్ 21, 22 తేదీల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
సోమవారం, 16 నవంబర్, 2026
4
వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

ఆరోగ్యకరమైన ఆహారాల జాబితా

మీ వంటకాలకు పోషక విలువలను చేకూర్చే పదార్థాల కోసం మీరు వెతుకుతున్నట్లయితే, మీరు సరైన చోటుకే వచ్చారు. అవి ఫైబర్, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు లేదా అలాంటి ఇతర అద్భుతమైన పోషకాలతో నిండి ఉన్నా లేకపోయినా, వాటిని తినడం వల్ల మీ శరీరానికి కలిగే అన్ని మేలును మేము మా ఎంపికలలో చేర్చాము, ఎందుకంటే అవి గణనీయమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి మరియు గుండెకు మేలు చేసే ఆహారాలు.



బాదం వంటి గింజలు

బాదంలో మెగ్నీషియం, విటమిన్ ఈ, ఐరన్, విటమిన్ సీ, కాల్షియం, ఫైబర్ మొదలైన అనేక రకాల పోషకాలు లభిస్తాయి. పోషకాల పరంగా బ్రెజిల్ నట్స్ అత్యంత ప్రయోజనకరమైన వాటిలో ఒకటి. ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఫైబర్‌కు గొప్ప వనరులైన ఈ ఆహారాలలో విటమిన్లు బీ-1, ఈ మరియు మెగ్నీషియం కూడా అధిక సాంద్రతలో లభిస్తాయి. బ్రెజిల్ నట్స్ సెలీనియంకు కూడా మంచి మూలం. సెలీనియం థైరాయిడ్ ఆరోగ్యానికి అవసరమైన మూలకం మరియు ఒక అద్భుతమైన యాంటీఆక్సిడెంట్. ఈ గింజలకు గట్టి పెంకు ఉంటుంది మరియు ఇవి సాధారణంగా తినడానికి సిద్ధంగా ఉంటాయి, అందువల్ల ఇవి సౌకర్యవంతమైన, ఆరోగ్యకరమైన చిరుతిండి ఎంపికగా నిలుస్తాయి.

కాయధాన్యాలు

ప్రపంచవ్యాప్తంగా వివిధ వంట సంప్రదాయాలలో పప్పు ధాన్యాలు ఒక ముఖ్యమైన పదార్థం. వీటిలో పాకిస్తాన్, నేపాల్, భూటాన్, భారతదేశం మరియు శ్రీలంక ఉన్నాయి. కాయధాన్యాలలో పీచుపదార్థం, మెగ్నీషియం, పొటాషియం ఉంటాయి. వాటిని ఉడకడానికి తరచుగా ఎక్కువ సమయం పడుతుంది. సులభంగా తినగలిగే మరియు పోషకమైన చిరుతిండిగా మార్చడానికి, ఉత్పత్తిదారులు విత్తనాన్ని మొలకెత్తించడానికి అనేక మార్గాలు ఉన్నాయి. లంచ్‌బాక్స్‌లో లేదా పిక్నిక్ బుట్టలో ప్యాక్ చేసినప్పుడు, మొలకెత్తిన కాయధాన్యాలు రుచి కోసం కొద్దిగా కారం లేదా మిరియాల పొడి చల్లుకుంటే చాలా బాగుంటాయి.

వోట్మీల్

ఓట్‌మీల్ దాని ఆరోగ్య ప్రయోజనాల కారణంగా గత రెండు దశాబ్దాలుగా ప్రజాదరణ గణనీయంగా పెరిగింది మరియు గుండెకు మేలు చేసే ఆహారాల జాబితాలో చేరింది. అనేక అధ్యయనాల ప్రకారం, తృణధాన్యాలు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంతో పాటు, హృదయ సంబంధిత వ్యాధుల ప్రమాద కారకాలను కూడా తగ్గిస్తాయని తేలింది. ఓట్స్‌లో సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు మరియు నీటిలో కరిగే పీచుపదార్థం ఉంటాయి. దీని ఫలితంగా రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలు స్థిరంగా ఉంటాయి. ఓట్‌మీల్‌లో ఫోలేట్ మరియు పొటాషియం రెండూ సమృద్ధిగా ఉంటాయి. ఓట్‌మీల్ ను తయారు చేయడానికి రోల్డ్ లేదా క్రష్డ్ ఓట్స్‌ను ఉపయోగించవచ్చు. క్విక్ ఓట్స్ కంటే స్టీల్-కట్ లేదా కోర్స్ ఓట్స్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది.

గోధుమ మొలక

గోధుమలోని ఇతర భాగాలలా కాకుండా, గోధుమ మొలక నిజంగా ఒక మొక్కగా అభివృద్ధి చెందుతుంది. ఇది ప్రాథమికంగా విత్తనం యొక్క పిండం. పిండి మిల్లులో మొలక మరియు తవుడు ఉప-ఉత్పత్తులుగా లభిస్తాయి. ధాన్యాల శుద్ధి ప్రక్రియలో ఈ మొలక మరియు తవుడు తరచుగా తొలగించబడతాయి. అయితే, సంపూర్ణ ధాన్యపు ఉత్పత్తులలో మొలక, ఊక ఇప్పటికీ ఉంటాయి. ఫలితంగా, ఆరోగ్యకరమైన ఎంపిక.



బ్రోకలీ

బ్రోకలీలో ఫైబర్, కాల్షియం, పొటాషియం, ఫోలేట్ మరియు ఫైటోన్యూట్రియెంట్లు అన్నీ లభిస్తాయి. గుండె జబ్బులు, మధుమేహం మరియు వివిధ రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడానికి ఫైటోన్యూట్రియెంట్లు సహాయపడతాయి. బ్రోకలీలో విటమిన్ సి మరియు బీటా-కెరోటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు కూడా లభిస్తాయి. అర కప్పు బ్రోకలీతో ఒక వ్యక్తికి రోజువారీ అవసర మయ్యే విటమిన్ సిలో సుమారు 85% వరకు తీర వచ్చు. మరోవైపు, బ్రకోలీని ఎక్కువగా ఉడికించడం వల్ల దాని పోషక విలువలు తగ్గిపోవచ్చు. ఈ కారణంగా, దానిని పచ్చిగా లేదా చాలా తక్కువగా వేడి చేసి తినడం శ్రేయస్కరం.

యాపిల్స్

ఫ్రీ రాడికల్స్‌తో పోరాడే యాంటీఆక్సిడెంట్లు ఆపిల్స్‌లో లభిస్తాయి. శరీరం ఫ్రీ రాడికల్స్‌ను ఉత్పత్తి చేస్తుంది, ఇవి తీవ్రమైన హానిని కలిగించవచ్చు. దీర్ఘకాలిక వ్యాధులు మరియు వృద్ధాప్య ప్రక్రియలోనే ఇవి ఒక కారకంగా ఉండే అవకాశం ఉంది. అయితే, కొన్ని పరిశోధనల ప్రకారం, ఆపిల్‌లోని యాంటీఆక్సిడెంట్ ప్రజలు ఎక్కువ కాలం జీవించడానికి మరియు దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే అవకాశాన్ని తగ్గించడానికి సహాయపడవచ్చు.

కాలే

ఆకుపచ్చ కూరగాయ అయిన కేల్‌లో అనేక పోషకాలు ఉంటాయి. పోషకాలు అధికంగా ఉండే ఈ మొక్కలో విటమిన్ సీ మరియు కే ముఖ్యంగా సమృద్ధిగా ఉంటాయి. కేల్‌ను గుండెకు ఉత్తమమైన ఆహారంగా కూడా పరిగణిస్తారు. కాలేను ఆవిరి మీద ఉడికించవచ్చు లేదా వండుకోవచ్చు. దీనిని స్మూతీలు లేదా పానీయాలలో కలపడం ద్వారా కూడా పోషకాలను అధికంగా పొందవచ్చు.

బ్లూ

బ్లూబెర్రీలలో లభించే పీచుపదార్థం, యాంటీఆక్సిడెంట్లు మరియు ఫైటోన్యూట్రియెంట్లు గణనీయంగా ఉంటాయి. ఖనిజాలు మరియు విటమిన్ల వలె జీవించడానికి ఫైటోన్యూట్రియెంట్లు అవసరం లేదు. అయినప్పటికీ, అవి అనారోగ్య నివారణకు, ముఖ్యమైన జీవసంబంధ ప్రక్రియల నిర్వహణకు సహాయపడవచ్చు.

అవకాడో

అవకాడోలలో కొవ్వు శాతం ఎక్కువగా ఉండటం వల్ల కొంతమంది వాటిని తినడానికి దూరంగా ఉంటారు. మరోవైపు, అవకాడోలు ఆరోగ్యకరమైన కొవ్వుకు, విటమిన్లు బీ, కే, మరియు ఈలకు మంచి మూలం. అవకాడోలకు క్యాన్సర్‌ను నిరోధించే గుణాలు కూడా ఉండే అవకాశం ఉంది మరియు అవి గుండెకు మేలు చేసే పండ్లలో ఒకటి. ఆరోగ్యకరమైన ఆహారం జీవక్రియ సంబంధిత ప్రమాద కారకాలను తగ్గిస్తుంది, పోషకాల శోషణను మెరుగుపరుస్తుంది – ఇవన్నీ అవకాడోలతో సాధ్యమయ్యే సంబంధాలు. అవకాడోలు ఆరోగ్యకరమైనవి, సంతృప్తినిస్తాయి, అందువల్ల వాటిని చిరుతిండిగా లేదా భోజనంగా తీసుకోవడానికి ఒక అద్భుతమైన ఎంపికగా నిలుస్తాయి.

పాలకూర వంటి ఆకుపచ్చ కూరగాయలు

పాలకూర యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే ఆకుకూర, ముఖ్యంగా దీనిని పచ్చిగా, ఆవిరి మీద ఉడికించి, లేదా చాలా తక్కువ సేపు వండినప్పుడు. ఇందులో సెలీనియం, నియాసిన్, జింక్, ఫాస్ఫరస్, రాగి, పొటాషియం, కాల్షియం, మాంగనీస్, బీటైన్ మరియు ఐరన్ వంటి పోషకాలు లభించవచ్చు.

చిలగడదుంప

చిలగడదుంపలలో పీచుపదార్థం, విటమిన్లు ఏ, సీ, బీ-6 మరియు పొటాషియం అన్నీ ఉంటాయి. విటమిన్ ఏ, విటమిన్ సీ, ఇనుము, కాల్షియం, ప్రోటీన్‌తో సహా అధిక స్థాయిలో విటమిన్లు మరియు ఖనిజాలు ఉండటమే కాకుండా, చిలగడదుంపలలో సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు కూడా అధిక స్థాయిలో ఉంటాయి.

చికెన్

కోడి మాంసం తక్కువ ధరలో అధిక నాణ్యత గల ప్రోటీన్ మూలం. స్వేచ్ఛగా పెరిగే కోడి ప్రోటీన్‌కు ఒక గొప్ప మూలం. అయితే, చికెన్‌ను తయారుచేసే మరియు వండే విధానం దాని పోషక విలువపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం. వేయించిన చికెన్‌ను పరిమితంగా తినాలి మరియు తినే ముందు దాని చర్మాన్ని ఎల్లప్పుడూ తీసివేయాలి. చికెన్ చర్మంలో సంతృప్త కొవ్వు శాతం చాలా ఎక్కువగా ఉంటుంది.


గుడ్లు

సమతుల్య ఆహారంలో వ్యక్తులు సులభంగా చేర్చుకోగలిగే మరో రకమైన ప్రోటీన్ గుడ్లు, ఇవి బహుముఖమైనవి. శక్తిని నిల్వ చేయడానికి మరియు ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి సహాయపడే అనేక రకాల విటమిన్లకు మూలంగా, గుడ్లు ప్రోటీన్‌కు ఒక అద్భుతమైన వనరు. గుడ్లలో అధిక సాంద్రతలో లభించే ఆవశ్యక అమైనో ఆమ్లమైన ల్యూసిన్, కండరాల ప్రోటీన్ సంశ్లేషణకు సహాయపడుతుంది. అదనంగా, ఆరోగ్యకరమైన కణ త్వచాలకు కీలకమైన కోలిన్ అనే పోషకానికి గుడ్లు ఒక అద్భుతమైన వనరు. కొవ్వు మరియు కొలెస్ట్రాల్‌తో పాటు, గుడ్డులోని చాలా విటమిన్లు మరియు ఖనిజాలు పచ్చసొనలోనే ఉంటాయి.

మీ ఆహారంలో ఈ 14 ఆహార పదార్థాలను చేర్చుకోవడం మీ శ్రేయస్సుపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. అయితే, ఒక వ్యక్తి ఆరోగ్యం మరియు శ్రేయస్సు కోసం సమతుల్య ఆహారం చాలా అవసరం. ప్రజలు ప్రతిరోజూ రకరకాల పోషకాలను తీసుకుంటున్నంత కాలం, అప్పుడప్పుడు ఇష్టమైనవి తినడం వారి ఆరోగ్యానికి హానికరం కాదని గుర్తుంచుకోవడం ముఖ్యం.

కొవ్వు చేప

నూనె అధికంగా ఉండే చేపల విషయానికి వస్తే, సాల్మన్, ట్రౌట్, మాకెరెల్, ఆంకోవీస్, హెర్రింగ్ మరియు సార్డిన్‌ల వంటివి మీకు గుర్తుకు రావచ్చు. ఈ చేపల జీర్ణనాళంలో మరియు దాని చుట్టూ చాలా నూనె ఉంటుంది. చేపల కొవ్వు లేని ఫిల్లెట్లలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి. ఆఫీస్ ఆఫ్ డైటరీ సప్లిమెంట్స్ ప్రకారం, ఈ నూనెలు గుండె మరియు నాడీ వ్యవస్థపై ప్రయోజనకరమైన ప్రభావాలను కలిగి ఉండవచ్చు (ODS).



జిమ్ ఎప్పుడు చేయాలి



జిమ్‌కు వెళ్లాలనుకునే చాలా మందికి ఉండే డౌట్ ఉదయం వర్కవుట్ చేయడం మంచి దా? లేక సాయంత్రం చేస్తే బెటరా? బరువు తగ్గడం నుంచి కండరాల పెరుగుదల వరకు ఏ సమయం మంచిది అనే విషయంపై చాలా మందికి సందేహం ఉంటుంది. అయితే ఇప్పటి వరకు జరిగిన పరిశోధనలు మాత్రం ఒక ఆసక్తికరమైన విషయాన్ని చెబుతున్నాయి. మీరు ఏ సమయంలో వ్యాయామం చేస్తున్నారన్న దానికంటే.. ఎంత రెగ్యులర్‌గా వ్యాయామం చేస్తున్నారనేది ముఖ్యం.

ఉదయం జిమ్ చేసినా.. లేదంటే సాయంత్రం జిమ్ చేసినా.. మీరు కంటిన్యూగా చేయడమే ఇంపార్టెంట్ అంటున్నాయి. మరి బరువు తగ్గడానికి ఎప్పుడు జిమ్ చేస్తే బెటర్ రిజల్ట్స్ ఉంటాయి? కండరాల పెరుగుదలకు ఏ సమయంలో వ్యాయామం చేయాలో.. పరిశోధనలు ఇస్తోన్న సూచనలు చూసేద్దాం.

బరువు తగ్గేందుకు..

2026లో ప్రచురితమైన సిస్టమాటిక్ రివ్యూ, మెటా-అనాలిసిస్‌లో 10 ర్యాండమైజ్డ్ అధ్యయనాల్లో పాల్గొన్న 402 మంది ఫలితాలను పరిశీలించారు. దీనిలో భాగంగా ఉదయం లేదా మధ్యాహ్నం, సాయంత్రం వ్యాయామం చేసినవారిలో.. బరువు, నడుము కొలత, కొవ్వు శాతంలో స్పష్టమైన తేడా కనిపించలేదు. కాబట్టి ఎప్పుడూ వ్యాయామం చేసినా.. బరువు తగ్గవచ్చని ఈ రివ్యూ హైలెట్ చేసింది.

అధిక బరువు ఉన్నవారు?

100 మంది అధిక బరువు లేదా ఊబకాయం ఉన్నవారిపై జరిగిన 12 వారాల ర్యాండమైజ్డ్ ట్రయల్‌లో.. ఉదయం, సాయంత్రం వ్యాయామం చేసిన రెండు గ్రూపుల్లోనూ బరువు తగ్గడం గుర్తించారు. ఉదయం వ్యాయామం చేసినవారు సగటున 2.7 కిలోలు, సాయంత్రం చేసినవారు 3.1 కిలోలు తగ్గినా.. ఒక సమయం మరొకదాని కంటే బెటర్ అని పరిశోధకులు నిర్ధారించలేదు. కాబట్టి వ్యాయామం ఎప్పుడూ చేసినా మంచి ఫలితాలు చూడవచ్చు.

ఉదయమే జిమ్ చేస్తే..

ఉదయం వ్యాయామం చేస్తే రోజువారీ పనులు, ఆఫీస్ మీటింగ్స్ లేదా ఇతర ప్లాన్లు వర్కవుట్‌కు అడ్డంకి అయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది. ముఖ్యంగా సాయంత్రానికి జిమ్‌కు వెళ్లడం కుదరని వారికి ఉదయం జిమ్‌కి వెళ్లడం మంచి ఎంపిక అవుతుంది.

సాయంత్రం జిమ్ చేస్తే కలిగే లాభాలు

రోజంతా శరీరం కదలికలో ఉండటం వల్ల సాయంత్రానికి కండరాలు బాగా వార్మ్ అయి ఉంటాయని కొందరు భావిస్తారు. అయితే స్ట్రెంగ్త్ లేదా ఎండ్యూరెన్స్ మెరుగుదలకు ఒక నిర్దిష్ట సమయమే ఉత్తమమని ప్రస్తుత పరిశోధనలు స్పష్టంగా చెప్పడం లేదు. కాబట్టి క్రమంగా ఒకే సమయంలో శిక్షణ తీసుకోవచ్చు. దీనివల్ల కండర పనితీరు మెరుగుపడుతుంది. అయితే సాయంత్రం జిమ్ చేయడం తప్పు కాదు కానీ.. నిద్రకు చాలా దగ్గరగా అధిక తీవ్రతతో కూడిన వ్యాయామం చేస్తే కొందరికి నిద్రపై ప్రభావం పడవచ్చు. మీ వర్కవుట్ తర్వాత నిద్ర సరిగా పడకపోతే సమయాన్ని ముందుకు మార్చుకోవడం మంచిది.

మీ రొటీన్‌కి సరిపోయే టైమ్ బెస్ట్..

సిస్టమాటిక్ రివ్యూలో భాగంగా 35 అధ్యయనాల్లో పాల్గొన్న 17 రిజల్ట్స్ పరిశీలించి.. ఉదయం వ్యాయామం మెరుగైనదని కొన్ని అధ్యయనాలు.. సాయంత్రం వ్యాయామం మెరుగైనదని మరికొన్ని అధ్యయనాలు తెలిపాయి. మిగిలిన వాటిలో స్పష్టమైన తేడా కనిపించలేదు. అంటే అందరికీ ఒకే బెస్ట్ టైమ్ ఉండదని ఈ పరిశోధన సూచిస్తోంది. మీకు సైజ్ లేకుండా చేసుకోగలిగే సమయం ఏదైనా మంచిదేనని చెప్తోంది.

క్రమం తప్పకుండా చేయడమే..

వారానికి రెండు రోజులు ఉదయం జిమ్ చేసి.. మిగిలిన రోజులు మానేయడం కంటే మీకు వీలైన సమయంలో క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం మంచిదని పరిశోధకులు చెప్తున్నారు. బరువు తగ్గడం కోసం వ్యాయామంతో పాటు ఆహారం, నిద్ర, రోజువారీ శారీరక శ్రమ కూడా కీలక పాత్ర పోషిస్తాయని గుర్తించుకోవాలంటున్నారు.

తిన్న వెంటనే గ్యాస్

ఈ ఐదు తప్పులు చేస్తున్నారేమో చూసుకోండి

ఈ మధ్యకాలంలో చాలామందికి జీర్ణ సమస్యలు పెరిగిపోయాయి. భోజనం చేసిన వెంటనే కడుపు ఉబ్బరం, గ్యాస్ లేదా అసౌకర్యం అనేవి చాలా కామన్ సమస్యలుగా మారిపోయాయి. దీని అర్థం మీరు తినే విధానంలోనే కొన్ని తప్పులే కావచ్చు. వేగంగా తినడం నుంచి తిన్న వెంటనే పడుకోవడం వరకు.. తెలియకుండా చేసే కొన్ని అలవాట్లు గ్యాస్, కడుపు ఉబ్బరం సమస్యను పెంచుతాయి. ఆ తప్పులు ఏంటో.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకుందాం.

సరిగ్గా నమలకపోతే: చాలామంది ఆహారాన్ని వేగంగా తింటారు. ఆహారాన్ని ఫాస్ట్ గా మింగడం అంటే సరిగ్గా నమలకపోవడమే. ఆహారాన్ని పూర్తిగా నమలడం అనేది జీర్ణక్రియలో మొదటి, అత్యంత ముఖ్యమైన దశ. ఎందుకంటే నోటిలోని లాలాజలం ఆహారాన్ని విచ్ఛిన్నం చేయడానికి సహాయపడుతుంది. ఆహారం సరిగ్గా నమలకుండా కడుపులోకి వెళ్తే దానిని జీర్ణం చేయడానికి కడుపు మరింత కష్టపడాల్సి వస్తుంది. దీనివల్ల గ్యాస్, బరువుగా అనిపించడం వంటి సమస్యలు వస్తాయి.

నీళ్లు తాగడం: అలాగే చాలా మందికి భోజనం చేసేటప్పుడు లేదా తిన్న వెంటనే ఎక్కువగా నీళ్లు తాగే అలవాటు ఉంటుంది. దీనివల్ల కడుపులోని జీర్ణరసాలు పలుచబడి.. సరైన జీర్ణక్రియ జరగదు. ఫలితంగా గ్యాస్, అజీర్ణం కలుగుతాయి. జీర్ణక్రియ సరిగ్గా జరగాలంటే భోజనానికి సుమారు అరగంట ముందు లేదా భోజనం చేసిన గంట తర్వాత నీళ్లు తాగడం మంచిది.

తిన్నవెంటనే పడుకోవడం: తిన్న వెంటనే మంచం మీద పడుకోవడం లేదా నిద్రపోవడం కూడా గ్యాస్ ఏర్పడటానికి ఒక ప్రధాన కారణమే కావచ్చు. పడుకోవడం వల్ల కడుపులోని ఆహారం, ఎసిడిటీ పైకి వచ్చి.. కడుపు ఉబ్బరం, గ్యాస్, గుండెల్లో మంటకు కారణమవుతాయి. తిన్న తర్వాత కనీసం 20 నుంచి 30 నిమిషాల పాటు నిటారుగా కూర్చోవడం లేదా కాస్త నడవడం జీర్ణక్రియకు మేలు చేస్తుంది.

డీప్ ఫ్రై చేసిన ఫుడ్: అతిగా వేయించిన, మసాలా లేదా నూనెతో కూడిన ఆహారాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఇవి కడుపుపై ఎక్కువ ఒత్తిడిని కలిగిస్తాయి. ఈ ఆహారాలను అధిక పరిమాణంలో తినడం వల్ల గ్యాస్ ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. అంతేకాకుండా.. కిడ్నీ బీన్స్, శనగలు, క్యాబేజీ వంటి కొన్ని కూరగాయలు, పప్పుధాన్యాలు కూడా సహజంగా గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తాయి. కాబట్టి వాటిని సరైన పరిమాణంలో, సరిగ్గా వండిన తర్వాత తింటే మంచిది.

తింటూ మాట్లాడటం: తింటూ ఎక్కువగా మాట్లాడితే.. శ్వాసను వేగంగా తీసుకోవాల్సి వస్తుంది. స్ట్రాతో తాగడం వంటివి కూడా కడుపులోకి గాలి చేరడానికి కారణమవుతాయి. ఈ విధంగా మింగిన గాలి కడుపు ఉబ్బరానికి, గ్యాస్‌కు కూడా కారణం కావచ్చు. అందుకే సైలెంట్‌గా, తక్కువ సంభాషణతో తినడం మంచిది.

ఈ అలవాట్లు మార్చుకుంటే మీకు మంచి ఫలితాలు కనిపిస్తాయి. అయితే సమస్య మళ్లీ మళ్లీ వస్తుంటే లేదా మరింత తీవ్రంగా మారితే.. దానిని నిర్లక్ష్యం చేయకుండా తప్పకుండా వైద్యుడిని సంప్రదించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఈ లక్షణాలు ఇంకేదైనా అంతర్లీన సమస్యకు సంకేతం కావచ్చు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి.



వెల్లుల్లి ప్రయోజనాలు

చలికాలం రాగానే.. ఆహారపు అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకోవడం ముఖ్యం. ఎందుకంటే ఈ సీజన్‌లో రోగనిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. దీనివల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. అలాంటప్పుడు వంటగదిలో లభించే కొన్ని పదార్థాలు కచ్చితంగా డైట్లో తీసుకోవాలి. ఎందుకంటే అవి శరీరాన్ని వెచ్చగా ఉంచడానికి, వివిధ వ్యాధుల నుంచి రక్షించడానికి ఔషధంగా పనిచేస్తాయి. అలాంటి వాటిలో వెల్లుల్లి ఒకటి. పతంజలి యోగపీఠ్‌కు చెందిన ఆచార్య బాలకృష్ణ ఇటీవల వెల్లుల్లి గురించి కొన్ని ముఖ్యమైన విషయాలను షేర్ చేశారు. వెల్లుల్లి కేవలం ఆహార రుచిని పెంచే ఒక సుగంధ ద్రవ్యం మాత్రమే కాదని.. చలికాలంలో ఇది శరీరానికి ఒక వరంలా పనిచేస్తుందని వివరించారు.



గుండె, కీళ్ల ఆరోగ్యానికై..

ఆచార్య బాలకృష్ణ ప్రకారం.. వెల్లుల్లిని సరిగ్గా తీసుకుంటే గుండె ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది రక్తంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. రక్తపోటును అదుపులో ఉంచి.. గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా చలికాలంలో వచ్చే కీళ్ల నొప్పులు, కండరాలు బిగుసుకుపోవడం వంటి సమస్యలను దూరం చేస్తుంది. వెల్లుల్లి తీసుకోవడం వల్ల ఈ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

వెల్లుల్లిని ఎలా తీసుకోవాలంటే..

వెల్లుల్లి ప్రయోజనాలను పెంచడానికి.. ఆచార్య బాలకృష్ణ కింది పద్ధతులను సూచిస్తున్నారు. గార్లిక్ నేరుగా కాకుండా ఇలా తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చని చెప్తున్నారు.

రాత్రిపూట నానబెట్టడం – 1 లేదా 2 వెల్లుల్లి రెబ్బలను వలిచి రాత్రిపూట నీటిలో నానబెట్టండి. ఉదయం పరగడుపున ఈ నీటిని తాగండి. లేదా రెబ్బలను నమలండి. కొలెస్ట్రాల్, రక్తపోటును నియంత్రించడానికి ఈ పద్ధతి చాలా ప్రభావవంతంగా ఉంటుంది.

గోరువెచ్చని నీటితో: ఉదయాన్నే పరగడుపున 1–2 పచ్చి వెల్లుల్లి రెబ్బలను గోరువెచ్చని నీటితో కూడా తీసుకోవచ్చు.

నొప్పి నివారణ కోసం వెల్లుల్లి నూనె

కీళ్ల నొప్పులు, వాపు లేదా కండరాల బిగుసుకుపోవడం కోసం వంటి సమస్యలను దూరం చేసుకోవాలనుకుంటే వెల్లుల్లి నూనెతో మసాజ్ చేయమని సిఫార్సు చేస్తున్నారు ఆచార్య బాలకృష్ణ. వెల్లుల్లి నూనె ఎలా చేసుకోవాలంటే..

సుమారు 50 గ్రాముల వెల్లుల్లిని మెత్తగా నూరండి.

దీనిని 100–200 గ్రాముల ఆవాలు, కొబ్బరి లేదా ఆలివ్ నూనెలో ఉడికించండి.

వెల్లుల్లి నల్లగా మారినప్పుడు.. నూనెను వడకట్టి నిల్వ చేయండి.

ఈ నూనె నొప్పి ఉన్న ప్రాంతంలో మసాజ్ చేయడం వల్ల గణనీయమైన ఉపశమనం లభిస్తుంది. ఇది నాడీ వ్యవస్థను బలపరుస్తుంది. వాత దోషాన్ని సమతుల్యం చేయడానికి సహాయపడుతుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 16.11.2026
www.mudranews.in | @mudranews

కిడ్నీల ఆరోగ్యానికి తోడ్పాటు!

బార్లీ నీరు శరీరానికి తగినంత ద్రవాలను అందించడంలో సహాయపడుతుంది. దీంతో మూత్ర విసర్జన సక్రమంగా జరిగేందుకు ఉపయోగపడుతుంది. అయితే కిడ్నీలో రాళ్లను నివారిస్తుందని చెప్పడానికి బలమైన ఆధారాలు లేవు.



అర్హులైన వారందరికీ పింఛన్లు

మెదక్ జిల్లాలో 11వేలు మంజూరు

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా

ముద్ర ప్రతినిధి, మెదక్: ఒంటరి మహిళలు, వితంతువులు, ఇతర అర్హులైన వర్గాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నూతన చేయూత పింఛన్ల కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహా అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా పింఛన్లు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు.మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్ ల మంజూరు ఉత్తర్వులను మంత్రి అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల నూతన పింఛన్లు మంజూరు చేయగా, ఒక్క మెదక్ జిల్లాలోనే 11 వేల పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాలకు కలిపి 1,400 పింఛన్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు.మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మహిళా సంఘాలకు పెద్దఎత్తున ప్రోత్సాహం అందిస్తోందన్నారు. బ్యాంకు లింకేజీ లేకుండానే లక్షల రూపాయల రుణాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, డ్రోన్ల నిర్వహణ వంటి రంగాల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో గుడిసెలు లేని సమాజాన్ని నిర్మించాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ఏటా 3,800 ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాలకు 1,400 ఇళ్లు కేటాయించగా, ఇప్పటివరకు 400 ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని, ఇళ్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధికి కృషి





చేస్తోందన్నారు.టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్, అందోల్, బొడ్మట్ పల్లి వంటి వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్థానిక నిరుద్యోగ యువతకు, నైపుణ్యం కలిగిన యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా



కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, మెదక్ ఇంచార్జ్ ఆర్టీవో రామకృష్ణ, టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పట్లోళ్ల విష్ణువర్ధన్ రెడ్డి, అల్లాదుర్గ్, రేగోడు, టేక్మాల్ మండలాల ఎంపీడీవోలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సజ్జనార్‌పై సీబీఐ విచారణ జరిపించాలి



సీఎం రేవంత్‌రెడ్డికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ

గోల్డ్ తెఫ్ట్, హామ్ వే కేసుల దర్యాప్తు తీరుపై ప్రశ్నలు..

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపైనా స్వతంత్ర విచారణకు డిమాండ్

ముద్ర, హైదరాబాద్: హైదరాబాద్ మాజీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హయాంలో చోటుచేసుకున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలు, కీలక కేసుల దర్యాప్తు తీరుపై స్వతంత్ర విచారణ జరిపించాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆదివారం సీఎంకు లేఖ రాస్తూ, సీబీఐ విచారణ లేదా న్యాయవిచారణకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.సజ్జనార్ హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సమయంలో నమోదైన గోల్డ్ తెఫ్ట్ కేసులో ఇప్పటివరకు ఆశించిన పురోగతి కనిపించడం లేదని రాజాసింగ్ తన లేఖలో ప్రశ్నించారు. ఈ కేసులో కీలక నిందితుల అరెస్టులు ఎందుకు జరగలేదని నిలదీశారు. అలాగే హామ్ వే కేసు దర్యాప్తు కూడా ఆలస్యమవుతోందని, దానికి గల కారణాలను స్వతంత్ర సంస్థతో పరిశీలించాలని కోరారు.తెలంగాణలో వెలుగులోకి వచ్చిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఈ కేసులో పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారుల పాత్రపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, అప్పటి పోలీస్ కమిషనర్‌గా సజ్జనార్ వ్యవహరించిన తీరుపైనా నిష్పక్షపాతంగా విచారణ జరగాలని పేర్కొన్నారు. జనార్గన్‌పై చేసిన ట్వీట్ అనంతరం సజ్జనార్ స్పందించిన తీరుపై కూడా మరిన్ని సందేహాలు వ్యక్తమవుతున్నాయని లేఖలో ప్రస్తావించినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి.మాజీ సీబీఐ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు గతంలో సజ్జనార్‌పై చేసిన బహిరంగ వ్యాఖ్యలను కూడా రాజాసింగ్ ప్రస్తావించారు. ఒక సీనియర్ పోలీసు అధికారిపై ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు ప్రభుత్వం వాటిని విస్మరించరాదని అభిప్రాయపడ్డారు.అదేవిధంగా కర్ణాటకలోని సజ్జనార్ స్వగ్రామం పరిసరాల్లో సుమారు 100 ఎకరాల భూమి కొనుగోలు చేసినట్లు వస్తున్న వార్తలపై కూడా విచారణ జరపాలని కోరారు. ఆస్తుల కొనుగోలుకు నిధుల మూలాలు, యాజమాన్య వివరాలు, ఆర్థిక లావాదేవీలు, తెలిసిన ఆదాయ వనరులతో ఆస్తుల విలువ సరిపోతుందా అనే అంశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.ఈ ఆరోపణలన్నింటిపై ప్రభుత్వ లేదా పోలీసు శాఖ అంతర్గత విచారణకు బదులుగా స్వతంత్ర దర్యాప్తు సంస్థతో సమగ్ర విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని రాజాసింగ్ పేర్కొన్నారు. అయితే ఇవన్నీ ఆయన లేఖలో చేసిన ఆరోపణలు, విచారణకు చేసిన డిమాండ్లు మాత్రమే; వాటిపై స్వతంత్రంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

హెచ్‌సీఎల్ హైదరాబాద్ సైక్లోథాన్‌లో 2,500 మంది సైక్లిస్టుల సందడి

సుస్థిర రవాణా, ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించాలి

సైబరాబాద్ సీపీ డా.ఎం.రమేష్



ముద్ర, శేరిలింగంపల్లి :హెచ్‌సీఎల్ హైదరాబాద్ సైక్లోథాన్ – సైక్లింగ్ రివల్యూషన్ 3వ ఎడిషన్ కార్యక్రమం ఆదివారం ప్రైమ్ అరేనాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ దూరాల విభాగాల్లో 2,500 మందికి పైగా సైక్లిస్టులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆరోగ్యం, శారీరక దృఢత్వం, పర్యావరణహిత పట్టణ రవాణా విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.గ్రీన్ రేస్‌తో పాటు ఇతర సైక్లింగ్ విభాగాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేశ్, ఐపీఎస్, జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) శ్రీ సున్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్, సీనియర్ ట్రాఫిక్ పోలీస్ అధికారులు, ఎస్‌సీఎస్‌సీ సీఈఓ నవీద్ ఆలమ్ ఖాన్, హెచ్‌సీఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మహిళా ఔత్సాహిక సైక్లిస్టులు మరింత పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ప్రోత్సహించాలని, తద్వారా సైక్లింగ్ కార్యక్రమాలను మరింత సమ్మిళితంగా, ప్రభావవంతంగా నిర్వహించవచ్చని అన్నారు. సైక్లింగ్ క్రీడను విస్తృత స్థాయిలో అభివృద్ధి చేసేందుకు సైక్లింగ్ ఫెడరేషన్, ఒలింపిక్ అసోసియేషన్‌లను ఒకే వేదికపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.హైదరాబాద్‌ను 'భారతదేశ ఈవెంట్ క్యాపిటల్'గా తీర్చిదిద్దాలన్న ఆకాంక్షను వ్యక్తం చేస్తూ, ప్రజల భాగస్వామ్యం, సామాజిక అనుసంధానం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే ప్రజా ప్రయోజన కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలని సీపీ సూచించారు.'మొబిలిటీ కాన్సస్ హైదరాబాద్'గా నగరాన్ని తీర్చిదిద్దాలి సైబరాబాద్‌లో పెరుగుతున్న పట్టణ రవాణా సవాళ్లను ప్రస్తావిస్తూ, ప్రతిరోజూ 10 లక్షలకు పైగా వాహనాలు సైబరాబాద్ రహదారులపై రాకపోకలు సాగిస్తున్నాయని, దీనివల్ల ట్రాఫిక్ రద్దీ గణనీయంగా పెరుగుతోందని సీపీ తెలిపారు. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి ప్రజా రవాణా, కార్‌పూలింగ్, సైక్లింగ్ వంటి ప్రత్యామ్నాయాలను ప్రజలు ఎక్కువగా వినియోగించాలని సూచించారు. సైక్లింగ్ వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు బాధ్యతాయుతమైన రవాణా విధానాలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు.నవంబర్ 26 నుంచి 'సైబరాబాద్ మూవ్స్' సదస్సురాబోయే నవంబర్ 26 నుంచి 28 వరకు టీ-హబ్, టీ-వర్క్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 'సైబరాబాద్ మూవ్స్' అర్బన్ మొబిలిటీ సింపోజియంపై సీపీ ప్రత్యేకంగా ప్రస్తావించారు.ఈ వేదికపై వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ సంస్థలు, పారిశ్రామిక రంగ ప్రముఖులు, ఇతర భాగస్వాములు ఒకచోట చేరి వినూత్న రవాణా పరిష్కారాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, భవిష్యత్ పట్టణ రవాణా వ్యవస్థపై చర్చించనున్నారు.దే శంలోనే తొలిసారిగా నిర్వహించనున్న ప్రత్యేక అనుభవాత్మక పట్టణ రవాణా వేదికగా 'సైబరాబాద్ మూవ్స్' నిలవనుందని సీపీ పేర్కొన్నారు. భవిష్యత్ రవాణా వ్యవస్థ రూపకల్పనలో భాగస్వాములు కావాలని, పౌరులు, వివిధ రంగాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

పదవీ విరమణ చేసిన సీఈకి మూడు పోస్టులతో

మరో ఆరు నెలల పొడిగింపా?


ఎక్స్‌టెన్షన్ ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలి

అర్హులైన ఎస్ఈలకు సీఈలుగా పదోన్నతులు కల్పించాలి..

లేకుంటే నిరసనలు

ఇరిగేషన్ ఇంజనీర్ల సంఘాల డిమాండ్

ముద్ర, హైదరాబాద్:నీటిపారుదల శాఖలో పదవీ విరమణ చేసిన ఒక చీఫ్ ఇంజనీర్ (సీఈ)కు మూడు సీఈ పోస్టుల బాధ్యతలతో మరో ఆరు నెలల పాటు పదవీ పొడిగింపు ఇస్తూ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని పలు ఇంజనీర్ల సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఇలాంటి పొడిగింపుల వల్ల అర్హులైన సూపరింటెండింగ్ ఇంజనీర్లకు (ఎస్ఈ) పదోన్నతులు దక్కకుండా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ మేరకు నవంబర్ 15న విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేశాయి.నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పదవీ విరమణ చేసిన చీఫ్ ఇంజనీర్లు, ఇంజనీర్ ఇన్ చీఫ్‌లకు తిరిగి పదవీ పొడిగింపులు ఇస్తున్నారని సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. సీఈ క్యాడర్‌లో ఖాళీలను అర్హులైన ఎస్ఈలకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సిన ప్రభుత్వం, పదవీ విరమణ చేసిన అధికారులనే తిరిగి అదే స్థాయి పోస్టుల్లో కొనసాగించడం వల్ల ఇంజనీర్ల పదోన్నతుల వ్యవస్థ దెబ్బతింటోందని పేర్కొన్నారు.ఐదు క్యాడర్లపై ప్రభావంఎక్స్‌టెన్షన్ల కారణంగా ఎస్ఈలుగా ఉన్న పలువురికి సకాలంలో సీఈలుగా పదోన్నతులు లభించడం లేదని సంఘాలు తెలిపాయి. పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు ఐదు క్యాడర్లలో పదోన్నతుల అవకాశాలు ప్రభావితమవుతున్నాయని వివరించాయి. ప్రస్తుతం ఇచ్చిన పొడిగింపు కారణంగా కనీసం పది మంది ఎస్ఈలు సీఈలుగా పదోన్నతి పొందకుండానే పదవీ విరమణ చేసే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించాయి. ఈ నెలలో మరో సీఈ పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆయన కూడా పొడిగింపు కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం ఉందని



పేర్కొన్నాయి.గతంలో ఎక్స్‌టెన్షన్లు రద్దు చేస్తామని ప్రభుత్వం పలుమార్లు హామీ ఇచ్చిందని, 2025లోనూ ఇకపై ఎవరికీ పొడిగింపులు ఇవ్వబోమని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు సంఘాలు గుర్తుచేశాయి. అలాంటి హామీ తర్వాత కూడా ఒకే అధికారికి మూడు సీఈ పోస్టుల బాధ్యతలతో మరో ఆరు నెలల పొడిగింపు ఇవ్వడం అన్యాయమని విమర్శించాయి.పొడిగింపులు కొనసాగితే ఉద్యమంఇప్పటికే ఇచ్చిన పదవీ పొడిగింపులను, తాజాగా జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసి, అర్హులైన ఎస్ఈలకు వారు పదవీ విరమణ చేయకముందే సీఈలుగా పదోన్నతులు కల్పించాలని సంఘాలు కోరాయి. పొడిగింపులు పొందిన అధికారుల విధానాలపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసన తెలియజేస్తామని, అవసరమైతే సహాయ నిరాకరణ వంటి కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించాయి.ఇంజనీరింగ్ రంగానికి విశిష్ట సేవలందించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య, నవాబ్ జంగ్ వంటి మహనీయుల వారసులుగా గుర్తింపు పొందాలా? లేక ఎక్స్‌టెన్షన్ల కోసం ప్రయత్నించిన అధికారులుగా మిగలాలా? అని సంబంధిత అధికారులను ప్రశ్నించనున్నట్లు ప్రకటించాయి.ఈ మేరకు హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్, తెలంగాణ ఇరిగేషన్ గ్రాడ్యుయేట్ ఇంజనీర్స్ అసోసియేషన్, అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, తెలంగాణ ఇరిగేషన్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి.

రిజిస్ట్రేషన్లలో దళారీ వ్యవస్థకు చెక్ పెట్టాలి

డాక్యుమెంట్ రైటర్లకు లైసెన్స్ విధానం

ప్రభుత్వ ఫీజుల బోర్డులు ఏర్పాటు చేయాలి

పారదర్శకతకు చర్యలు తీసుకోవాలి

తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారగోని ప్రవీణ్‌కుమార్ డిమాండ్

ముద్ర, ఎల్బీనగర్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పారదర్శకంగా మార్చి, దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారగోని ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డాక్యుమెంట్ రైటర్లకు ప్రభుత్వ గుర్తింపుతో కూడిన లైసెన్స్ విధానం అమలు చేయాలని, ప్రతి కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ల ఫీజులు, ప్రభుత్వ రుసుముల వివరాలను తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.హైదరాబాద్ విస్తరణ ప్రాంతాలైన ఉప్పల్, శంకర్‌పల్లి, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు, లింక్ డాక్యుమెంట్లు, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ), మార్కెట్ విలువ, స్లాట్ బుకింగ్, ఆధార్ అనుసంధానం, బయోమెట్రిక్ వంటి అంశాలపై అవగాహన లేక ప్రజలు డాక్యుమెంట్ రైటర్లపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. చిన్నపాటి తప్పిదం జరిగినా డాక్యుమెంట్లు తిరస్కరణకు గురవుతాయనే భయంతో అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని వివరించారు. రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు వసూళ్ల ఆరోపణలు ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, వెంచర్లు, గ్రామకంఠం, ఇనాం భూముల రిజిస్ట్రేషన్లు పెద్ద సంఖ్యలో జరుగుతున్న ప్రాంతాల్లో సిబ్బంది, స్లాట్ల కొరతను ఆసరాగా చేసుకుని దళారీ వ్యవస్థ బలపడుతోందని ఆరోపించారు. ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.5 నుంచి రూ.8 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కొందరు సబ్ రిజిస్ట్రార్ల పేర్లు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయన్నారు. ఈ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వసూళ్లను ప్రశ్నించిన నేపథ్యంలో ఉద్యోగులు సెలవులో వెళ్లినట్లు వచ్చిన సమాచారం కూడా కార్యాలయాల జవాబుదారీతనంపై ప్రశ్నలు లేవనెత్తుతోందని ఆయన వ్యాఖ్యానించారు. న్యాయవాదులకు బార్ కౌన్సిల్ లైసెన్స్, చార్టర్డ్ అకౌంటెంట్లకు ఐసీఏఐ రిజిస్ట్రేషన్ ఉన్నట్లుగానే డాక్యుమెంట్ రైటర్లకు కూడా ప్రభుత్వం లైసెన్స్‌లు జారీ చేయాలని సూచించారు. లైసెన్స్ పొందినవారికే కార్యాలయాల్లో డాక్యుమెంట్ రైటింగ్ సేవలు అందించే అవకాశం కల్పించాలని, అధిక ఫీజులు వసూలు చేసినట్లు నిర్ధారణ అయితే లైసెన్స్ రద్దు చేసే నిబంధన తీసుకురావాలని కోరారు. కొత్త చట్టాలు, ఆన్‌లైన్ విధానాలు, స్టాంప్ డ్యూటీ మార్పులపై రైటర్లకు శిక్షణ ఇవ్వాలని సూచించారు.ప్రభుత్వ ఫీజుల వివరాలు బహిరంగంగా ప్రదర్శించాలి. సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్, వీలునామా తదితర డాక్యుమెంట్లకు డాక్యుమెంట్ రైటర్ల సేవా రుసుమును ప్రభుత్వం నిర్ణయించాలని కోరారు. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ఫీజుల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని తెలిపారు. ప్రభుత్వ రుసుములు, డాక్యుమెంట్ రైటర్ల ఫీజులను వేర్వేరుగా చూపించాలని సూచించారు. ప్రతి డాక్యుమెంట్‌పై రైటర్ లైసెన్స్ నంబర్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలని, నగదు లావాదేవీలకు బదులుగా యూపీఐ లేదా బ్యాంకు చెల్లింపుల ద్వారా ఫీజులు స్వీకరించే విధానం తీసుకురావాలని కోరారు. ఆన్‌లైన్ రసీదులు జారీ చేయడంతో పాటు ప్రతి కార్యాలయంలో సీసీ కెమెరాలు, హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉద్యోగులు ఒకే కార్యాలయంలో సుదీర్ఘకాలం కొనసాగకుండా రొటేషన్ విధానం అమలు చేయాలని పేర్కొన్నారు.లైసెన్స్ విధానం, నిర్ణీత ఫీజులు, బహిరంగ ఫీజుల బోర్డులు, పారదర్శక చెల్లింపుల వ్యవస్థ అమలైతే ప్రజలపై అదనపు ఆర్థిక భారం తగ్గడంతో పాటు నిజాయితీగా పనిచేసే డాక్యుమెంట్ రైటర్లకు కూడా గుర్తింపు, భద్రత లభిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సమస్యపై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ, రాష్ట్ర రెవెన్యూ మంత్రి తక్షణమే స్పందించి విచారణకు ఆదేశించాలని, రిజిస్ట్రేషన్ కార్యాలయాలను దళారుల ప్రభావం నుంచి విముక్తి చేసి ప్రజలకు పారదర్శక సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 16.11.2026
www.mudranews.in | @mudranews

శరీరానికి హైడ్రేషన్!

వేసవిలోనే కాకుండా ఏడాది పొడవునా బార్లీ నీరు తాగవచ్చు. ఇది శరీరానికి ద్రవాలను అందించి డీహైడ్రేషన్ బారిన పడకుండా తోడ్పడుతుంది.





పాక్ సైన్యంలో కెప్టెన్..
ఇప్పుడు బలూచ్ లిబరేషన్ ఆర్మీ చీఫ్!

ముద్ర, అంతర్జాతీయం : పాకిస్తాన్ సైన్యంలో ఒకప్పుడు కెప్టెన్‌గా పనిచేసిన రెహ్మాన్ గుల్ అలియాస్ మురీద్.. ఇప్పుడు అదే పాక్ సైన్యానికి సవాల్‌గా మారిన బలూచ్ లిబరేషన్ ఆర్మీ (BLA)కి నాయకత్వం వహించనున్నారు. బీఎల్ఏ కొత్త కమాండర్-ఇన్-చీఫ్‌గా సీనియర్ కమాండర్ రెహ్మాన్ గుల్‌ను నియమించింది. బలూచిస్తాన్‌కు స్వాతంత్ర్యం కోసం పాకిస్తాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఎల్ఏ సాయుధ పోరాటం కొనసాగిస్తోంది. తమ ప్రాంతంపై పాక్ ప్రభుత్వం పాల్పడుతున్న చర్యలను వ్యతిరేకిస్తూ ఆ సంస్థ పలు దాడులకు పాల్పడుతోంది. ఈ నేపథ్యంలో బీఎల్ఏలో కీలక నాయకత్వ మార్పు చోటుచేసుకుంది.

బీఎల్ఏ కొత్త అధిపతిగా రెహ్మాన్ గుల్..

బీఎల్ఏ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. సీనియర్ కమాండ్ కౌన్సిల్ సభ్యులు, కమాండర్లతో చర్చించిన అనంతరం రెహ్మాన్ గుల్‌ను కొత్త కమాండర్-ఇన్-చీఫ్‌గా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గతంలో ఆయన సంస్థ సీనియర్ కమాండ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా కూడా పనిచేశారు. బీఎల్ఏలో పలు కీలక బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఆయనకు ఉంది. ఇప్పటివరకు బీఎల్ఏలో కీలక సైనిక విభాగమైన మజీద్ బ్రిగేడ్‌కు రెహ్మాన్ గుల్ నాయకత్వం వహించారు. పాక్ సైన్యంలో పనిచేసిన అనుభవం ఉండటంతో అక్కడి సైనిక వ్యవస్థ, కార్యకలాపాలపై ఆయనకు అవగాహన ఉందని బీఎల్ఏ వర్గాలు పేర్కొంటున్నాయి.

పాక్ సైన్యంలో కెప్టెన్‌గా..ఆ తర్వాత బీఎల్ఏలోకి

రెహ్మాన్ గుల్ 1984 ఆగస్టు 14న బలూచిస్తాన్‌లోని నౌష్కీ ప్రాంతంలో జన్మించారు. 2002లో పాకిస్తాన్ సైన్యంలో చేరిన ఆయన.. 19 ఫ్రంటియర్ ఫోర్స్ రెజిమెంట్‌లో సుమారు ఎనిమిదేళ్ల పాటు పనిచేశారు. కాకుల్‌లోని పాకిస్తాన్ మిలిటరీ అకాడమీలో రెండేళ్లపాటు శిక్షణ పొందారు. అనంతరం కెప్టెన్ హోదాలో సైన్యంలో సేవలందించారు. సుమారు ఎనిమిదేళ్ల సైనిక సేవ తర్వాత 2010లో పాక్ సైన్యాన్ని వీడి బలూచ్ లిబరేషన్ ఆర్మీలో చేరారు. ఆ తర్వాత సంస్థలో కీలక స్థాయికి ఎదిగారు. ముఖ్యంగా మజీద్ బ్రిగేడ్‌కు నాయకత్వం వహిస్తూ పలు దాడుల్లో కీలక పాత్ర పోషించినట్లు బీఎల్ఏ పేర్కొంది.

బషీర్ జెబ్ స్థానంలో కొత్త నాయకత్వం

బీఎల్ఏలో ఇటీవల నాయకత్వ మార్పులు జరిగాయి. నవంబర్ 3న బషీర్ జెబ్ ఇకపై కమాండర్-ఇన్-చీఫ్ బాధ్యతల్లో ఉండరని సంస్థ ప్రకటించింది. ఆయన స్థానంలో ఇప్పుడు రెహ్మాన్ గుల్‌ను నియమించింది. 2018 డిసెంబర్‌లో అస్లాం బలూచ్ మరణించిన తర్వాత బషీర్ జెబ్ బీఎల్ఏ పగ్గాలు చేపట్టారు. ఆఫ్ఘనిస్తాన్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిలో అస్లాం బలూచ్ మరణించారు. అనంతరం బషీర్ జెబ్ నేతృత్వంలో బీఎల్ఏ పాకిస్తాన్ సైన్యం, పోలీసు బలగాలు, చైనా–పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (CPEC) ప్రాజెక్టులను లక్ష్యంగా చేసుకుని పలు దాడులు చేసింది. 2018లో కరాచీలోని చైనా కాన్సులేట్‌పై దాడి, 2019లో గ్వాదర్‌లోని పెర్ల్ కాంటినెంటల్ హోటల్‌పై దాడి, 2020లో కరాచీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌పై దాడి వంటి ఘటనల్లో బీఎల్ఏ బాధ్యత ప్రకటించింది. 2025 మార్చిలో జరిగిన జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు హైజాకింగ్ ఘటనకు కూడా ఆ సంస్థ బాధ్యత వహించినట్లు ప్రకటించింది. ఇప్పుడు రెహ్మాన్ గుల్ నాయకత్వంలో బీఎల్ఏ తన కార్యకలాపాలను మరింత ముందుకు తీసుకెళ్లనున్నట్లు సంస్థ ప్రకటించింది.

ట్రంప్‌కు కోర్టులో మరో షాక్..
-వైట్‌హౌస్ సమీపంలోని గోల్ఫ్ కోర్స్ ప్రాజెక్టుకు బ్రేక్!

ముద్ర, అంతర్జాతీయం : వాషింగ్టన్‌లో చారిత్రాత్మక పబ్లిక్ గోల్ఫ్ కోర్స్‌ను ఆధునీకరించాలన్న డొనాల్డ్ ట్రంప్ ప్రణాళికకు తాత్కాలిక అడ్డంకి ఎదురైంది. నిర్మాణ పనులు ప్రారంభం కావడానికి ముందే అమెరికా కోర్టు స్టే విధించింది. స్థానిక ప్రజలు, పరిరక్షణ సంస్థల న్యాయపోరాటంతో ఈ ప్రాజెక్టు నిలిచిపోయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి మరో ఎదురుదెబ్బ తగిలింది. వాషింగ్టన్‌లోని వైట్‌హౌస్‌కు సుమారు రెండు మైళ్ల దూరంలో ఉన్న చారిత్రాత్మక గోల్ఫ్ కోర్స్‌ను భారీ స్థాయిలో ఆధునీకరించాలన్న ట్రంప్ ప్రణాళికకు అమెరికా న్యాయస్థానం తాత్కాలికంగా బ్రేక్ వేసింది.నిర్మాణ పనులు ప్రారంభం కావడానికి కొద్ది గంటల ముందు కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ గోల్ఫ్ కోర్స్‌ను 15 నెలల పాటు మూసివేసి అభివృద్ధి పనులు చేపట్టాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే స్థానిక ప్రజలు, పర్యావరణ, చారిత్రక ప్రదేశాల పరిరక్షణ సంస్థలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ న్యాయపోరాటం ప్రారంభించాయి. దీంతో ప్రాజెక్టు పనులు ప్రస్తుతానికి నిలిచిపోయాయి. వాషింగ్టన్‌లోని ఈస్ట్ పొటోమాక్ గోల్ఫ్ లింక్స్ విషయంలో ఈ వివాదం కొనసాగుతోంది. పొటోమాక్ నది ఒడ్డున ఉన్న ఈ చారిత్రాత్మక పబ్లిక్ గోల్ఫ్ కోర్స్‌లో సామాన్య ప్రజలు కూడా గోల్ఫ్ ఆడేందుకు అవకాశం ఉంది. అయితే ట్రంప్ ప్రభుత్వం చేపట్టాలనుకుంటున్న కొత్త ప్రాజెక్టుతో ఈ గోల్ఫ్ కోర్స్ అసలు స్వరూపం మారిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో గోల్ఫ్ ఆడే ఫీజులను భారీగా పెంచితే సామాన్యులకు ఈ సదుపాయం అందుబాటులో ఉండదని వారు వాదిస్తున్నారు. అయితే ఈ ఆందోళనలను ట్రంప్ తోసిపుచ్చారు. స్థానికంగా నివసించే వారికి గోల్ఫ్ ఆడే ఫీజులో 50 శాతం తగ్గింపు ఇస్తామని ప్రకటించారు. మీడియా కథనాల ప్రకారం, డీసీ ప్రిజర్వేషన్ లీగ్ ఇద్దరు స్థానిక గోల్ఫ్ క్రీడాకారులు ఫిబ్రవరిలోనే ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా న్యాయపోరాటం ప్రారంభించారు. గోల్ఫ్ కోర్స్‌ను మూసివేసి నిర్మాణ పనులు చేపడితే తమకు, సామాన్య ప్రజలకు తిరిగి భర్తీ చేయలేని నష్టం జరుగుతుందని వారు కోర్టును ఆశ్రయించారు.ఈ కేసుపై శుక్రవారం కోర్టులో సుమారు ఐదు గంటల పాటు విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఈస్ట్ పొటోమాక్ పార్క్‌ను భద్రతా కారణాలతో మూసివేయాల్సి వస్తోందని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ పార్కులో మూడు గోల్ఫ్ కోర్సులు, ఒక చిన్న గోల్ఫ్ కోర్స్, సైక్లింగ్ మార్గాలు, ఇతర వినోద సదుపాయాలు ఉన్నాయి. ప్రస్తుతం పార్కు నిర్వహణ బాధ్యతలు చూస్తున్న నేషనల్ లింక్స్ ట్రస్ట్ తో ప్రభుత్వ ఒప్పందం ఆదివారంతో ముగుస్తుందని కూడా ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు.

తెలంగాణ క్రీడా చరిత్రలో
ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 ఒక మైలురాయి

-క్రీడల నిర్వహణకు రూ.203.13 కోట్ల రాష్ట్ర బడ్జెట్..
-శాశ్వత మౌలిక వసతుల కల్పనే లక్ష్యం : మంత్రి వాకిటి శ్రీహరి



ముద్ర ప్రతినిధి, న్యూఢిల్లీ : తెలంగాణ వేదికగా డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఎనిమిదవ ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026కు సంబంధించిన లోగో, మస్కట్‌ను కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, క్రీడల ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్, సాట్స్ ఎండీ సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మీడియాతో మాట్లాడుతూ.. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు తెలంగాణను ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరిగే ఈ క్రీడా సంబరాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించామని, ఆయన సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.

కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.21 కోట్లకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.203.13 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులను కేవలం క్రీడల నిర్వహణకే పరిమితం చేయకుండా, రాష్ట్రం లోని స్టేడియాల్లో శాశ్వత మౌలిక వసతుల కల్పనకు వినియోగిస్తామని పేర్కొన్నారు. తద్వారా భవిష్యత్తులోనూ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, సాధనకు అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈసారి ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో మొత్తం 27 క్రీడాంశాలు ఉండగా, తెలంగాణ సంప్రదాయ క్రీడ అయిన కర్రసాము కూడా చేర్చడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా 7 వేల మందికి పైగా క్రీడాకారులతో పాటు సుమారు 1,200 మంది కోచ్‌లు, సహాయక సిబ్బంది ఈ పోటీల్లో పాల్గొనున్నారని వెల్లడించారు. హైదరాబాద్‌తోపాటు హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేస్తున్నామని చెప్పారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు మత్తు వదలండి.. మైదానాలు చేరండి అనే నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన నశా ముక్త్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచి, క్రీడలు, వ్యాయామం వైపు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ద్వారా తెలంగాణ క్రీడా ప్రతిభ దేశవ్యాప్తంగా చాటడంతో పాటు, రాష్ట్రాన్ని క్రీడా రంగంలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.



ట్రంప్‌కు ఇరాన్ వార్నింగ్!

-అమెరికా మరోసారి దాడి చేస్తే యుద్ధ స్వరూపమే మార్చేస్తాం..
-చర్చలకైనా, యుద్ధానికైనా సిద్ధమే అంటూ సవాల్..



ముద్ర, అంతర్జాతీయం : అమెరికా మరోసారి ఇరాన్‌పై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, శాంతిచర్చల్లో కీలక ప్రతినిధి మొహమ్మద్ బాఘర్ గాలిబాఫ్ హెచ్చరించారు. అమెరికా చర్చల మార్గాన్ని ఎంచుకున్నా, యుద్ధాన్ని ఎంచుకున్నా తమకు అభ్యంతరం లేదని అన్నారు. ఇరాన్ ప్రతిపాదించిన ఏడు షరతులను అంగీకరిస్తేనే ఒప్పందానికి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. అమెరికా మరో తప్పు చేస్తే యుద్ధ స్వరూపమే మారిపోతుందని వార్నింగ్ ఇచ్చారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల వేళ ఇరాన్ నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. అమెరికా, ఇజ్రాయిల్‌లు ఫిబ్రవరి 28న ఇరాన్‌పై సంయుక్తంగా దాడులు ప్రారంభించాయి. తొలిరోజు దాడిలోనే ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. దీని తర్వాత ఇరాన్ మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలను టార్గెట్ చేస్తూ దాడులు చేసింది. యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, కువైట్, బహ్రైయిన్ దేశాలపై డ్రోన్లు, మిస్సైళ్లతో దాడులు చేసింది. ఇదిలా ఉంటే, ఇరాన్‌పై మళ్లీ దాడులు చేసే విషయంలో డొనాల్డ్ ట్రంప్ వైఖరి మారినట్లు తెలుస్తోంది. ఇరాన్ లేదా యెమెన్‌లోని హౌతీలు కవ్వింపు చర్యలకు పాల్పడకపోతే ఇరాన్‌పై మరోసారి దాడి చేయకుండా ఉండేందుకు అవకాశం ఉందని ట్రంప్ తన సీనియర్ సలహాదారుల వద్ద ప్రస్తావించినట్లు నివేదికలు వెల్లడించాయి. గత రెండు వారాలుగా ట్రంప్ సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్, టర్కీ అధ్యక్షుడు తయ్యిప్ ఎర్డోగాన్ అభిప్రాయాలను కోరినట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయవద్దని వారిద్దరూ సూచించినట్లు తెలుస్తోంది.

లలిత్ మోడీకి బ్రిటిష్ పౌరసత్వం..
-ఇకయూకేనే శాశ్వత నివాసం!

ముద్ర, జాతీయం : ఇండియన్ ప్రీమియర్ లీగ్ వ్యవస్థాపకుడు, మాజీ ఐపీఎల్ చైర్మన్ లలిత్ మోడీకి బ్రిటిష్ పౌరసత్వం లభించింది. భారత్‌లో ఆర్థిక అవకతవకల ఆరోపణలు ఎదుర్కొంటూ 2010లో దేశం విడిచి లండన్‌కు వెళ్లిన ఆయన, తాజాగా బ్రిటిష్ పౌరసత్వం పొందినట్లు ప్రకటించారు. నవంబర్ 15 ఉదయం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో కొన్ని ఫొటోలను షేర్ చేస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. బ్రిటన్ పౌరసత్వం పొందడం తన జీవితంలో ఎంతో సంతోషకరమైన, గర్వించదగిన సందర్భమని పేర్కొన్నారు. లలిత్ మోడీ తెలిపిన వివరాల ప్రకారం, కుటుంబ సభ్యులు, సన్నిహిత మిత్రుల సమక్షంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు బ్రిటిష్ పౌరసత్వం లభించింది. గత కొన్నేళ్లుగా బ్రిటన్‌లో నివసిస్తున్నానని, ఇప్పుడు ఆ దేశమే తన శాశ్వత నివాసంగా మారిందని ఆయన పేర్కొన్నారు. బ్రిటన్‌లో ప్రజలు, సంస్థలు, సంప్రదాయాలకు ఎంతో గౌరవం ఉంటుందని.. ఆ దేశ విలువలపై తనకు గట్టి నమ్మకం ఉందని తెలిపారు.

మిడిల్ ఈస్ట్‌లో మళ్లీ యుద్ధ సైరన్..

-ఇరాన్‌పై నెతన్యాహు డెడ్లీ వార్నింగ్



ముద్ర, అంతర్జాతీయం : పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇరాన్ అణు కార్యక్రమంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చేసిన తాజా వ్యాఖ్యలు అంతర్జాతీయంగా కలకలం రేపుతున్నాయి. ఇజ్రాయెల్‌కు ఎదురవుతున్న ముప్పును శాశ్వతంగా తొలగించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన శనివారం హెచ్చరించారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తోందని, యురేనియం శుద్ధిని తిరిగి ప్రారంభించడం ఇజ్రాయెల్ భద్రతకు తీవ్ర ముప్పుగా మారుతుందని నెతన్యాహు ఆరోపించారు. ఇరాన్ పాలకులు ఇజ్రాయెల్‌ను పూర్తిగా నాశనం చేయాలని చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అణ్వాయుధాలను ఇరాన్ సమకూర్చుకుంటే వాటిని ఇజ్రాయెల్‌పై ప్రయోగించేందుకు వెనుకాడదని నెతన్యాహు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో చేపట్టిన సైనిక ఆపరేషన్ల తరహాలోనే ఇరాన్ అణు కేంద్రాల ముప్పును అడ్డుకుని, దానిని పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే సమయంలో ఇరాన్ ముప్పును ఎదుర్కొనేందుకు ఇజ్రాయెల్‌లో బలమైన నాయకత్వం అవసరమని నెతన్యాహు పేర్కొన్నారు. దేశంలోని ప్రధాన రాజకీయ పక్షాలన్నీ కలిసి 'జాతీయ ఐక్యతా ప్రభుత్వం' ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. గురువారం ప్రతిపక్ష నేత గాడి ఐజెన్‌కోట్‌తో సమావేశమైన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఎలాంటి ముందస్తు షరతులు లేకుండా చర్చలకు రావాలని కోరారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఏ కూటమికీ స్పష్టమైన మెజారిటీ రాలేదు. మొత్తం 120 ---స్థానాలున్న పార్లమెంట్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు 61 సీట్లు అవసరం. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ ప్రభుత్వ ఏర్పాటుకు ఐజెన్‌కోట్‌ను ఆహ్వానించారు. అరబ్ పార్టీల మద్దతుతో మైనారిటీ ప్రభుత్వం ఏర్పాటు చేసే ప్రయత్నాలను నెతన్యాహు తీవ్రంగా వ్యతిరేకించారు. ఉగ్రవాద మద్దతుదారులపై ఆధారపడే బలహీనమైన ప్రభుత్వం ఇరాన్ వంటి పెద్ద ముప్పును ఎదుర్కోలేదని విమర్శించారు. అయితే నెతన్యాహు ప్రతిపాదనను గాడి ఐజెన్‌కోట్, ఆయన 'యషార్' పార్టీ వర్గాలు తిరస్కరించాయి. ఎన్నికల్లో ఓటమి తర్వాత అధికారాన్ని నిలుపుకునేందుకు భద్రతా అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని ఐజెన్‌కోట్ ఆరోపించారు. ఇలాంటి రాజకీయ ఎత్తుగడలు తన వద్ద పనిచేయవని స్పష్టం చేసిన ఆయన.. త్వరలోనే అత్యవసర జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మరోవైపు ఇరాన్‌పై ఏకపక్షంగా లేదా రాజకీయ ప్రయోజనాల కోసం సైనిక చర్యలకు దిగొద్దని ఐజెన్‌కోట్ ఇప్పటికే నెతన్యాహును హెచ్చరించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 16.11.2026
www.mudranews.in | @mudranews

జీర్ణ సమస్యలకు ఉపశమనం

బార్లీ నీటిలోని పీచు పదార్థం జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. మలబద్ధకం సమస్యను తగ్గించి పేగుల కదలికలు సక్రమంగా జరిగేలా తోడ్పడుతుంది.



కళ్యాణం.. కమనీయం



వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణోత్సవం విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు.ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.సాయంత్రం సంధ్య వేళ ఆలయ ధ్వజస్తంభమునకు మోక్ష నారాయణ దీపాన్ని వెలిగించారు.

- ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

క్యాన్సర్‌పై విజయం సాధించడం సాధ్యమే

ఆంకాలజిస్ట్ డాక్టర్ సోమ శ్రీకాంత్

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, ముందస్తు గుర్తింపు, ఆధునిక చికిత్సా విధానాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని స్థానిక సంకల్ప్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రత్యేకంగా క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సదస్సులో ఆసుపత్రికి చెందిన ప్రముఖ మెడికల్, సర్జికల్, రేడియేషన్ ఆంకాలజీ నిపుణులు డాక్టర్ సోమ శ్రీకాంత్ పాల్గొని క్యాన్సర్ నివారణ మార్గాలను వివరించారు.క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా పూర్తిస్థాయిలో నయం చేసే అవకాశాలు మెరుగవుతాయన్నారు.మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, పొగాకు, మద్యం వినియోగం క్యాన్సర్ ముప్పును పెంచుతున్నాయని ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన



అధునాతన వైద్య సాంకేతికతతో క్యాన్సర్‌పై విజయం సాధించడం సాధ్యమేనని అన్నారు.మహిళల్లో ఎక్కువగా కనిపించే రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల నివారణకు క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.యువతలో హెచ్‌పివి వ్యాక్సినేషన్ ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను సమర్థవంతంగా అడ్డుకోవచ్చని,క్యాన్సర్ రోగులకు కేవలం వైద్య చికిత్స మాత్రమే కాకుండా, మానసిక స్థైర్యాన్ని నింపే కౌన్సెలింగ్, పౌష్టికాహార సలహాలు కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు.సమాజంలో క్యాన్సర్ పట్ల భయాన్ని వీడి, ఏవైనా అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే వెంటనే నిపుణులను సంప్రదించాలని పిలుపునిచ్చారు.ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా భవిష్యత్తులో మరిన్ని ఉచిత స్క్రీనింగ్ శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తామని యశోద ఆసుపత్రి ప్రతినిధులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు, సాధారణ ప్రజలు పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

ఎటుచూసినా ఎర్రజెండాలే..

రైతుల మహా సమాగమం దృశ్యమాలిక













నల్లగొండ పట్టణం ఎర్రజెండాల రెపరెపలతో కొత్త శోభను సంతరించుకుంది. ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభల సందర్భంగా ఎన్జీ కాలేజీ గ్రౌండ్ ఎర్రసంద్రంగా మారింది. భారీగా తరలివచ్చిన రైతులు, కార్యకర్తలతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది.దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి రైతు సంఘాల నాయకులు, ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో నల్లగొండకు చేరుకున్నారు. తమ సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం జాతీయ వేదికపై గళం విప్పేందుకు రైతులు ఉత్సాహంగా సభకు హాజరయ్యారు. ఈ కార్యక్రమ దృశ్యమాలికను చూడొచ్చు.

- ముద్ర, నల్లగొండ

గ్రంథాలయ వారోత్సవాలలో పుస్తక ప్రదర్శన



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం భువనగిరి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఎండి.అవేస్ చిస్తీ, టీజీవో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్, జిల్లా జేఏసీ చైర్మన్ మందాడు ఉపేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు బర్రె జహంగీర్, ఎనబోయిన ఆంజనేయులు, బీజేపీ పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, బీజేపీ సీనియర్ నాయకులు చందా మహేందర్ గుప్తా, గ్రంథాలయ ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

ఘనంగా సూపర్ స్టార్ కృష్ణ వర్ధంతి



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : వెండి తెర సూపర్ స్టార్, మాజీ పార్లమెంటు సభ్యులు ఘట్టమనేని కృష్ణ 4వ వర్ధంతిని ఆదివారం భువనగిరి లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద "రాష్ట్ర మహేష్ కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్ స్టార్ కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర మహేష్ కృష్ణ సేవా సమితి కో – ఆర్డినేటర్, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి పిట్టల బాలరాజు మాట్లాడుతూ పద్మభూషణ్ అవార్డు గ్రహీత, సూపర్ స్టార్ కృష్ణ, సినిమా పరిశ్రమలో మొట్టమొదటి సారిగా కలర్, డాల్బీ సిస్టం, 70 ఎంఎం స్క్రీన్ సిస్టమ్ లను ప్రేక్షకులకు పరిచయం చేసిన కృష్ణ ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోయాడని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాడూరి నర్సింహ, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం డి షరీఫ్, యాదాద్రి భువనగిరి జిల్లా మహేష్ కృష్ణ సేవాసమితి ప్రధాన కార్యదర్శి కానుకుంట్ల రమేష్ కోటి, వైస్ ప్రెసిడెంట్ నీల ఆంజనేయులు, సూపర్ స్టార్ కృష్ణ సేవా సమితి నాయకులు పోకల యాదగిరి, నాయకులు సిరికొండ శివకుమార్, గుమిడెల్లి రమేష్, ప్రభాకర్, వల్లపు పర్వతాలు, తంబాల మల్లేశం పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షులుగా కొండపల్లి సురేష్ మాదిగ



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎం ఈ ఎఫ్) యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి సైదులు మాదిగ అధ్యక్షత ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కొండపల్లి సురేష్ మాదిగ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తుల కుమార్, జనరల్ సెక్రటరీ గడ్డం గిరిబాబు,కోశాధికారి దేశపాండ్య భరత్, అడిషనల్ సెక్రటరీ చీమల ఆంజనేయులు,ఉపాధ్యక్షులు ఊదరి రిష్ కుమార్, వేణుమాధవ్, సీహెచ్ వేణు, భువనగిరి పట్టణ అధ్యక్షులు పొట్ట శ్రీనివాస్ మాదిగ ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో జాతీయ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ మంద దేవేంద్రప్రసాద్ మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు మల్లెపాక వెంకన్న, ఫాల్వాయి ఎంకన్న, రాష్ట్ర అధ్యక్షులు చేబర్తి యాదగిరి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వీ. కృష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింత జాన్విల్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన కొండపల్లి సురేష్ మాదిగ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మాదిగ ఉద్యోగుల ఐక్యతను బలోపేతం చేస్తూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధన కోసం, సమాజ అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. నాయకత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, సమాఖ్య అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సైబరాబాద్ లో వీకెండ్–స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్

282 మందిపై కేసులు



ముద్ర, శేరిలింగంపల్లి : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ఏడిసిపి అడ్మిన్, జి నరేందర్.ఈ డ్రైవ్‌లో భాగంగా 276 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.233 ద్విచక్ర వాహన దారులు,11 ఆటోలు,36 కార్లు, 02 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే —232మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, –39 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, –11 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత – 2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.గత వారంలో 185 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.15 మందికి జరిమానా, జైలు శిక్ష, 09 మందికి జరిమానా, సోషల్ సర్వీస్, 161 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 16.11.2026
www.mudranews.in | @mudranews

బరువు తగ్గడానికి బార్లీ నీరు!



బార్లీలో ఉండే బీటా గ్లూకాన్ అనే పీచు పదార్థం ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగిస్తుంది. దీంతో తరచూ ఆకలి వేయడం తగ్గి బరువు నియంత్రణకు సహాయపడుతుంది.

చెయ్యి లేదు 'చేయూత' లేదు..

అవిటితనానికి 'గుర్తింపు' అసలే లేదు.

ఒంటి చేత్తో కుటుంబ భారాన్ని మోస్తున్న ఓ దివ్యాంగుని దీన గాథ





ముద్ర, జవహర్‌నగర్: ఒక చేత్తో మట్టి తట్ట మోస్తూ.. మరోవైపు భార్యాపిల్లల బాధ్యతలను భుజాన వేసుకుని జీవనపోరాటం చేస్తున్నాడు ఓ దివ్యాంగుడు. పుట్టుకతోనే ఒక చేయి లేకపోయినా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే అతడి కష్టానికి తగిన గుర్తింపు, ప్రభుత్వ పథకాల అండ మాత్రం అందడం లేదు. జవహర్‌నగర్‌లో నివసిస్తున్న రవి దీనగాథ ఇది.కర్ణాటక నుంచి చిన్నతనంలోనే బతుకు దెరువు కోసం నగరానికి వచ్చిన రవి, గత పదేళ్లుగా జవహర్‌నగర్‌లోని వడ్డెర బస్తీలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఏడేళ్ల క్రితం వివాహం చేసుకున్న అతడికి ఐదేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. కుటుంబ పోషణ కోసం అడ్డా కూలీగా పని చేస్తున్నాడు. రెండు చేతులున్న వారు చేసే పనులను సైతం ఒకే చేత్తో చేయడానికి శ్రమిస్తున్నాడు. రోజంతా కష్టపడితే వచ్చే అరకొర ఆదాయంతో ఇంటి అద్దె, పిల్లల పోషణ, ఇతర కుటుంబ ఖర్చులను నెట్టుకొస్తున్నాడు.అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యంచిన్నప్పటి నుంచి ఒక చేయి లేకపోయినా ఇప్పటివరకు ప్రభుత్వ ఆసరా పింఛన్ అందలేదని రవి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కృత్రిమ చేయి కోసం ప్రయత్నించినా ఫలితం దక్కలేదని, సొంతింటి కల కూడా నెరవేరలేదని వాపోతున్నాడు. పింఛన్, ఇల్లు వంటి ప్రభుత్వ సాయాల కోసం ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా తన సమస్య పరిష్కారం కాలేదని చెబుతున్నాడు.ది వ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు పలు పథకాలు, చట్టాలు అమలు చేస్తున్నప్పటికీ రవి వంటి అర్హులకు వాటి ప్రయోజనాలు అందడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చదువులేకపోవడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన లేకపోవడం, దరఖాస్తు ప్రక్రియపై స్పష్టత లేకపోవడం వంటి కారణాలతో చాలామంది దివ్యాంగులు తమకు అందాల్సిన ప్రయోజనాలకు దూరమవుతున్నారని దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు.అధికారులు స్పందించాలిజవహర్‌నగర్‌లో నివసిస్తున్న రవి పరిస్థితిని మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించాలని దివ్యాంగుల సంఘాలు, నాయకులు కోరుతున్నారు. అర్హతలను పరిశీలించి వెంటనే ఆసరా పింఛన్ మంజూరు చేయడంతో పాటు, ప్రభుత్వ గృహ పథకం కింద ఇంటిని కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైతే కృత్రిమ అవయవం అందించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.ఒంటి చేత్తో కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న రవికి ప్రభుత్వ చేయూత ఎప్పుడు అందుతుందో వేచి చూడాలి. అతడి కుటుంబానికి భరోసా కల్పించేలా తతక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

కేటీఆర్ సభ రద్దు వెనుక అసలు కారణమేంటి?

బీఆర్ఎస్ లో హాట్ టాపిక్..

ముద్ర, డెస్క్:



పీసీసీ చీఫ్ సొంత జిల్లా పై గులాబీ పార్టీ ఫోకస్ పెట్టింది. ఒకప్పుడు కంచు కోటగా ఉన్న ఆ జిల్లాలో పార్టీ పూర్వ వైభవం కోసం.. స్వయంగా ఆ పార్టీ అధినేత రంగంలో దిగుతున్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల పై ప్రత్యేక దృష్టి పెట్టిన ఆ పార్టీ.. ఈ నెలలో నాలుగు బహిరంగ సభలు పెట్టాలని నిర్ణయించింది. ఈనెల 19న తల పెట్టిన నిజామాబాద్ సభ వాయిదా పడింది. కేటీఆర్ సభ వాయిదా వెనుక అసలు ఏం జరిగింది..? కేటీఆర్ కాకుండా కేసీఆర్ ఎందుకు సభ కు ఫోకస్ పెట్టారు?ఉత్తర తెలంగాణ జిల్లాలను కవర్ చేస్తూ.. బి.ఆర్. ఎస్. వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ రైతు గర్జన పేరిట నాలుగు భారీ బహిరంగ సభలను ప్లాన్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం లక్ష్య గా ఈ సభలు ఆదిలాబాద్, నిర్మల్ లో సభలు నిర్వహించారు. మూడో సభ ఈ నెల 19 న జరగాల్సి ఉండగా.. ఉన్నపలంగా సభ వాయిదా వేశారట ఆ పార్టీ నేతలు. సభను ఎక్కడ పెట్టాలనే అంశంపై నేతల మధ్య చర్చోప చర్చలు జరిగాయట. ఐతే మాజీ ఎమ్మెల్యేల మధ్య సయోధ్య కుదరలేదట. మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గంలో సభ పెట్టాలని ప్రతిపాదన పెట్టగా.. ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు నసేమిరా అన్నారట. మూడు సార్లు గెలిచిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో సభ ఎందుకంటూ.. పెదవి విరిచారట.సభ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పెట్టాలని కొందరు, కామారెడ్డి జిల్లా కేంద్రంలో పెడితే బాగుంటుందని మరి కొందరు మాజీలు ప్రతిపాదన పెట్టారట. కానీ సభ ఎక్కడ నిర్వహించాలనే అంశంపై సయోధ్య కుదరక వాయిదా వేశారనే టాక్ గులాబీ పార్టీలో నడుస్తుది. మరో వైపు.. ఈనెల 29న కరీంనగర్ జిల్లా అలగనూరు చౌరస్తా కేంద్రంగా దీక్షా దివాస్ సభ గ్రాండ్ గా నిర్వహించాలని ఉత్తర తెలంగాణ జిల్లా నుంచి భారీగా జన సమీకరణ చేయాలని నిర్ణయం తీసుకోవడం వల్లే.. నిజామాబాద్ రైతు గర్జన సభ వాయిదా పడిందనే చర్చ జరుగుతోంది.నిజామాబాద్ లో కేటీఆర్ రైతు గర్జన సభ వాయిదా పడటం తో.. మళ్ళీ సభ ఎప్పుడూ ఉంటుందనే చర్చ గులాబీ పార్టీలో జోరుగా జరుగుతోంది. ఐతే ఇందూరు సభ కు పార్టీ అధినేత కేసీఆర్ హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తం చేశారట. ఆ పార్టీకి కంచు కోటగా ఉన్న ఇందూరు లో పార్టీకి పూర్వ వైభవం కోసం స్వయంగా కేసీఆర్ రంగంలోకి దిగాలని నిర్ణయం తీసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. నిజామాబాద్ జిల్లా గులాబీ నేతల మధ్య సఖ్యత లేకపోవడం, బీజేపీ బల పడుతుండటం, పీసీసీ అధ్యక్షుడు సొంత జిల్లాలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని లక్ష్యం తో స్వయంగా కేసీఆర్ రంగంలోకి దిగుతున్నట్లు ప్రచారం సాగింది. ఈ మేరకు కేటీఆర్ రైతు గర్జన సభ స్థానంలో గులాబీ అధినేత నిజామాబాద్ కేంద్రంగా భారీ బహిరంగ సభకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని పార్టీలో చర్చ జరుగుతోంది. అయితే సభ డిసెంబర్ తేదీ ఇంకా ఖరారు కాలేదట. నిజామాబాద్ జిల్లా కేంద్రం లోనే ఈ సభ ఉండేలా నేతలు ప్లాన్ చేస్తున్నారట. డిసెంబర్ నెలలో...సభ ఉంటుందని చర్చించుకుంటున్నారు ఆ పార్టీ నేతలు.మొత్తానికి నేతల మధ్య అండ్‌స్టాండింగ్ లేక కేటీఆర్ సభ వాయిదాపడటంపై పార్టీలో వాడివేడి చర్చ జరుగుతోంది. ఇప్పుడు మళ్లీ కేసీఆర్ సభపై అందరి ఫోకస్ పడింది. ఈ సభపైన అయినా విభేదాలు మరిచి అందరూ దృష్టిపెట్టాలని హైకమాండ్ ఆదేశాలు ఇచ్చిందట.

యుద్ధానికి సై..



ఇరాన్ వద్ద ఇంకా 2,500 క్షిపణులు..!

ముద్ర, డెస్క్:


అసలు ఇరాన్ అమ్ముల పొదిలో ఎన్ని క్షిపణులు ఉన్నాయో అర్థంకాక అమెరికా నిఘా వర్గాలు జుట్టుపీక్కొంటున్నాయి. ఇరాన్ వద్ద ఇప్పటికే 1500 నుంచి 2,500 క్షిపణులు యుద్ధానికి సిద్ధంగా ఉన్నట్లు నిఘా వర్గాలు అంచనావేసినట్లు అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. తక్కువలో తక్కువగా చూసినా.. యుద్ధం ప్రారంభం నాటికి దాని వద్ద ఉన్న మొత్తం క్షిపణుల నిల్వల్లో సగానికి సమానం. ఇరాన్‌కు ఇప్పటికీ బలమైన దాడులు చేయగల సామర్థ్యం ఉన్నదన్న విషయం మాత్రం వాస్తవం. సీఐఏ మాజీ విశ్లేషకుడు, కింగ్స్ కాలేజ్ లండన్ స్కాలర్ ఎంత రహస్య సమాచారాన్ని విశ్లేషించినా.. ఇరాన్ వద్ద ఉన్న మొత్తం క్షిపణుల సంఖ్యను చెప్పడం కష్టమని పేర్కొన్నారు. యుద్ధం మొదలైన నాటి నుంచి ఇరాన్ వద్ద సుమారు 2,500 క్షిపణులున్నాయంటూ మూడు సార్లకు పైగా వివిధ రిపోర్టులు వచ్చాయి. ఈ మధ్యలో ఇరాన్ వందల క్షిపణులను వాడింది. అయినా.. అమెరికా, ఇజ్రాయెల్ అంచనాల్లో తగ్గుదల మాత్రం కనిపించలేదు. ఇరాన్ వద్ద చాలా రహస్య భూగర్భ స్థావరాలు ఉండటంతో క్షిపణుల సంఖ్యను కచ్చితంగా కనుగొనడం పశ్చిమ దేశాల ఇంటెలిజెన్స్ వర్గాలకు సాధ్యం కావడంలేదు. అమెరికా భారీ స్థాయిలో దాడులు చేసినా.. ఇరాన్ ఇప్పటికీ ప్రతి నెలా 50 వరకు బాలిస్టిక్ క్షిపణులను ఉత్పత్తి చేస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. వారి వద్ద షాహిద్ శ్రేణి ఆయుధాలు వేల సంఖ్యలో ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.

గ్యాస్ రిఫైనరీ ఉద్యోగుల బస్సు బోల్తా.. 12 మంది దుర్మరణం



ముద్ర, ఇరాన్ : గ్యాస్ రిఫైనరీ సంస్థకు చెందిన ఉద్యోగులతో వెళ్తున్న ఓ బస్సు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 12 మంది ఉద్యోగులు దుర్మరణం పాలయ్యారు. మరో 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారంతా ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పశ్చిమ ఇరాన్ లోని ఇరాక్ సరిహద్దుకు సమీపంలో అబ్దానాన్, డెహ్లోరాన్ మధ్య ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం విషయాన్ని ఇరాన్ మీడియా వెల్లడించింది. ఈ ప్రమాదంపై దర్యాప్తు జరుగుతున్నదని తెలిపింది. గాయాల తీవ్రత దృష్ట్యా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అక్కడి అధికారులు వెల్లడించారు. కాగా ఇరాన్‌లో రహదారి భద్రత రికార్డు చాలా పేలవంగా ఉంది. మార్చి వరకు గడిచిన 12 నెలల్లో రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 20 వేల మంది ప్రాణాలు కోల్పోయారని అధికారిక ఇరానియన్ లీగల్ మెడిసిన్ ఆర్గనైజేషన్ జూన్‌లో తెలిపింది.

ఏయిర్‌పోర్టులో రెండు విమానాలు ఢీ



ముద్ర, మియామి:అమెరికా లో విమానాల రాకపోకలు నిలిచిపోవడంతో శుక్రవారం తీవ్ర గందరగోళం నెలకొన్నది. శుక్ర, శనివారాల్లో విమానాశ్రయాల్లో లక్షలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఈ ఘటనను మరువకముందే శనివారం రాత్రి మియామి అంతర్జాతీయ విమానాశ్రయంలోని టార్మాక్‌పై రెండు విమానాలు ఢీకొన్నాయి. రన్‌వేపై మలుపు తిరుగుతున్న ఒక విమానం రెక్క కొన వెనుకనున్న విమానం ముక్కుకు తగిలింది.శనివారం రాత్రి 9:15 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పనామా సిటీ నుంచి 166 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో వచ్చిన కోపా ఎయిర్‌లైన్స్ బోయింగ్ 737 విమానం రెక్క కొన.. ఎయిర్‌పోర్టు టాక్సీవేలపై కదులుతున్న యూపీఎస్ బోయింగ్ 767 కార్గో విమానం ముక్కును ఢీకొట్టిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారని కోపా ఎయిర్‌లైన్స్ ఆదివారం వెల్లడించింది. వారు చికిత్స పొందుతున్నారని ప్రాణాపాయం లేదని తెలిపింది. ఈ ఘటన జరిగినందుకు తాము చింతిస్తున్నామని పేర్కొన్నది.

మళ్లీ హద్దు మీరిన చైనా.. భారత గగనతలంలోకి చైనా సైనిక విమానం

సిక్కిం భూభాగంపై చక్కర్లు!



ముద్ర, న్యూఢిల్లీ: ఒక చైనా సైనిక విమానం ఈ నెల 12న సిక్కింలోని భారత గగనతలంలోకి చొరబడి 20–25 నిమిషాల పాటు చక్కర్లు కొట్టిందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఆ ప్రాంతం భారత భూభాగంలోని అత్యంత సున్నితమైన భాగాలలో ఒకటైన 'సిలిగురి కారిడార్'కు అభిముఖంగా ఉండడంతో ఈ పరిణామం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈనెల 12న ఉదయం 8 గంటల సమయంలో చైనా విమానం కదలికలను భారత వైమానిక దళం పసిగట్టిందని, తమ భూభాగంలోకి తిరిగి వెళ్లాలని పదేపదే హెచ్చరికలు జారీ చేసిందని ఆ వర్గాలు తెలిపాయి. 25 వేల అడుగుల ఎత్తులో ఈ విమానం కదలికలను గుర్తించినట్టు పేర్కొన్నాయి.

సిలిగురి కారిడార్ ప్రాముఖ్యత

సిలిగురి కారిడార్ పశ్చిమ బెంగాల్‌లోని ఒక సన్నని భూభాగం. ఇది అత్యంత సన్నగా ఉన్న చోట సుమారు 20–22 కిలోమీటర్ల వెడల్పుతో ఉండి, ఈశాన్య ప్రాంతాన్ని భారతదేశంలోని మిగిలిన ప్రాంతాలతో కలుపుతుంది. దీనిని చికెన్స్ నెక్ అని కూడా పిలుస్తారు. ఇది చైనా, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్‌లకు సమీపంలో ఉన్నందున దీనిపై జరిగే ఏ సాధారణ సైనిక కార్యకలాపమైనా భద్రతా ప్రణాళికల అధికారుల దృష్టిని తక్షణం ఆకర్షిస్తుంది. చైనాకు చెందిన టిబెట్ స్వయంప్రతిపత్తి ప్రాంతంతో సరిహద్దును సిక్కిం పంచుకుంటుంది. డోక్లామ్ పీఠభూమికి ఇది సమీపంలో ఉంటుంది.

గత అనుభవాలు

చైనా సైనిక విమానాలు సరిహద్దు వెంబడి ఆందోళన కలిగించడం ఇది మొదటిసారి కాదు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఎక్కువగా ఉన్న సమయాల్లో ఇలాంటి ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయి. 2022 జూన్‌లో ఒక చైనా సైనిక విమానం తూర్పు లద్దాఖ్‌లో భారత సైనిక స్థావరాలకు అత్యంత సమీపం నుంచి ప్రయాణించింది. భూతల సిబ్బంది, భారత రాడార్లు దానిని గుర్తించగా ఐఏఎఫ్ ప్రతిస్పందన అధికార యంత్రాంగాన్ని క్రియాశీలం చేసింది. భారత్ ఈ విషయాన్ని చైనాతో సైనిక మార్గాల ద్వారా ప్రస్తావించింది. 2020లో తూర్పు లద్దాఖ్‌లో ప్రతిష్టంభన సమయంలో చైనా సైనిక హెలికాప్టర్లు వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ)కు సమీపంలో సంచరిస్తూ కనిపించాయి. ఆ ప్రాంతంలో ఎలాంటి చొరబాటునైనా అడ్డుకోవడానికి ఐఏఎఫ్ యుద్ధ విమానాలను దింపింది. ఆ హెలికాప్టర్లు భారత గగనతలంలోకి ప్రవేశించలేదని అధికారులు తెలిపారు. 2017 అక్టోబర్ 11న ఉత్తరాఖండ్‌లోని బరాహోటి ప్రాంతంలో రెండు చైనీస్ హెలికాప్టర్లు చొరబడినట్టు సమాచారం. ఈనెల 7న నాలుగు చైనా హెలికాప్టర్లు లద్దాఖ్‌లోకి చొరబడ్డాయి.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555